జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ శుక్రవారం 09, ఆగస్టు 2024 ‖ ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం

## వర్గీకరణ రాజ్యాంగ ఉల్లంఘన కాదు

- జస్టిస్ చంద్రచూడ్



**ఢిల్లీ, మహానాడు:**
చారిత్రక ఆధారాలు పరిశీలిస్తే ఎస్సీ వర్గంలో ఉన్న వారంతా నిజానికి ఒకేవర్గం కాదని ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ చంద్రచూడ్ జస్టిస్ మిశ్రాతో కలిసి స్వయంగా రాసిన తీర్పులో పేర్కొన్నారు. కులాలను వర్గీకరించడం రాజ్యాంగంలోని 14వ అధికరణలో పేర్కొన్న సమానత్వ హక్కును ఉల్లంఘించినట్లు కాదని చెప్పారు. ఎస్సీ కులాల్లో కొత్తగా ఏదైనా కులాన్ని చేర్చే హక్కు పార్లమెంటుకు ఉంటుందని చెప్పే ఆర్టికల్ 341(2)కు ఎస్సీ కులాల వర్గీకరణ విరుద్ధం కాదని అన్నారు.

రాష్ట్రాలకు ఆర్టికల్ 15(వివక్ష లేని), ఆర్టికల్ 16(సమాన అవకాశాలు) కింద ఆయావర్గాల వెనుకబాటుతనాన్ని గుర్తించి రిజర్వేషన్లను కల్పించే అధికారం ఉందన్నారు. ఆర్టికల్ 341లో పేర్కొన్న కులాలను వేరు చేసి చూడటానికి హేతుబద్ధమైన సూత్రం ఉన్నపుడు, ఆ సూత్రం మిగతా.. 2లో



## రోడ్లపై దృష్టి



- ముఖ్యమైన రోడ్లకు వెంటనే మోక్షం
- టోల్ నిర్మాణాలపై టీడీపీలో చర్చ
- కారు, బస్సులు మినహా అన్నింటికీ టోల్ ఉండదు
- సౌకర్యంగా ఉంటే ప్రజలు ఎందుకు వ్యతిరేకిస్తారన్న బాబు
- పల్లా ఆందోళనను కొట్టిపారేసిన చంద్రబాబు
- జనాభా నియంత్రణపై ఆసక్తికరమైన చర్చ
- కేంద్రనిధులు తగ్గుతాయన్న యనమల, సోమిరెడ్డి
- ఉత్తరాది-దక్షిణాది మధ్య అంతరాలను వివరించిన యనమల
- పేదరిక నిర్మూలనపై ఆసక్తికరమైన చర్చ
- గిరిజనుల నిరక్షరాస్యతపై దృష్టి సారించాలన్న సోమిరెడ్డి
- జిల్లాల్లో పార్టీ ఆఫీసులకు ప్రభుత్వభూములివ్వాలని కోరిన పల్లా
- జాబితా తయారుచేయాలని సూచించిన చంద్రబాబు
- త్వరలో పార్టీ సభ్యత్వాలు.. యాప్ ద్వారా నమోదు
- ఇన్సూరెన్సు పథకం ఉంటుందన్న లోకేష్
- తొలిదశ నామినేటెడ్ పదవుల జాబితా సిద్ధం
- కూటమికీ న్యాయం చేయాలన్న చంద్రబాబు
- కొత్తవారిని పార్టీలో చేర్చుకోవాలని సీనియర్లకు సూచన

(మార్తి సుబ్రహ్మణ్యం)

ఏపీలో గత ఐదేళ్ల జగన్ పాలనలో ధ్వంసమయిన రోడ్లపై దృష్టి సారించాలని టీడీపీ నిర్ణయించింది. ఆ మేరకు ధ్వంసమైన రోడ్ల స్థాయిని గుర్తించి, అందులో ముఖ్యమైన రోడ్లను తక్షణమే నిర్మించేందుకు కూటమి సర్కారు సిద్ధమవుతోంది. జాతీయ రహదారుల్లోని పట్టణాలు-నగరాల్లో టోల్‌గేట్ల ఏర్పాటుద్వారా, కొత్త రోడ్లు వేయాలని నిర్ణయించింది. ఆ మేరకు మంగళగిరిలోని టీడీపీ ఆఫీసులో జరిగిన పొలిట్‌బ్యూరో సమావేశంలో, సీఎం చంద్రబాబునాయుడుకు సీనియర్ సభ్యులు కొన్ని సూచనలు చేశారు.

అత్యంత విశ్వసనీయ సమాచారం ప్రకారం.. పొలిట్‌బ్యూరో సమావేశంలో రాష్ట్రంలో రోడ్ల నిర్మాణంపై చర్చ జరిగింది. తక్షణం రోడ్లు వేయాల్సిన అవసరాన్ని బాబు దృష్టికి తీసుకువెళ్లారు. ఆ క్రమంలో టోల్‌గేట్ నిర్మాణాల అంశం ప్రస్తావనకు వచ్చింది. అయితే టోల్‌గేట్లు నిర్మించి డబ్బు వసూలు చేస్తే, ప్రజల్లో వ్యతిరేకత వచ్చే ప్రమాదం ఉందని పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసయాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు.

దానికి స్పందించిన చంద్రబాబు.. 'మనం ప్రజలకు సౌకర్యం కల్పిస్తున్నాం. వాళ్లు రోడ్లు నిర్మించి టూవీలర్, ట్రాక్టర్లు మినహా కార్లు-బస్సుల నుంచి టోల్ వసూలు చేస్తే మిగతా.. 2లో



## రైతులకు విత్తనాల కొరత లేకుండా చూడండి

- నూటికి నూరు శాతం ఈ-క్రాప్ నమోదు చేయాలి
- జులైలో భారీవర్షాలకు దెబ్బతిన్న పంటలకు రూ.36 కోట్లు ఇన్ పుట్ సబ్సిడీ
- పొలాల్లో పురుగు మందులు పిచికారికి డ్రోన్లు వినియోగించేలా ప్రోత్సహించాలి
- డ్రోన్ టెస్టింగ్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు
- మైక్రో ఇరిగేషన్ పరికరాల తయారీకి మ్యాన్యాక్చరింగ్ పార్కు ఏర్పాటుకు కృషి
- వ్యవసాయ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

**అమరావతి, మహానాడు:**
రాష్ట్రంలో రైతులకు ఎక్కడా విత్తనాలు కొరత రాకుండా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. జూలైలో కురిసిన భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులు తిరిగి పంటలు వేసుకునేందుకు వీలుగా రూ.36 కోట్లను ఇన్ పుట్ సబ్సిడీ కింద విడుదల చేయాలని ఆర్థికశాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో వందశాతం ఈ-క్రాప్ నమోదు చేయాలని అధికారులకు సూచించారు. పెట్టుబడి వ్యవయాన్ని తగ్గించి రైతుకు నికర ఆదాయం పెరిగేలా వ్యవసాయంలో తగిన మార్పులు తీసుకోవాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

రాష్ట్ర సచివాలయంలో గురువారం వ్యవసాయ అనుబంధ రంగాలపై సీఎం సమీక్షించారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వ్యవసాయ శాఖకు సంబంధించిన కార్యక్రమాలను, పథకాలను, ఆ రంగం అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ వ్యవసాయంలో ఉత్పత్తిని పెంపొందించడంతో పాటు రైతుకు నికర ఆదాయాన్ని పెంచేలా సాంకేతికతను వినియోగించాలన్నారు. సాగులో ఉత్తమ విధానాలను అవలంభించడం ద్వారా ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచడం తోపాటు మిగతా.. 2లో

## జగన్ విధ్వంసంపై విడుదల చేసిన శ్వేతపత్రాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

- పొలిట్ బ్యూరో సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**మంగళగిరి, మహానాడు:**
మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన పొలిట్ బ్యూరో సమావేశం గురువారం జరిగింది. ఆ వివరాలను ఏపీ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్య క్షుడు పల్లా శ్రీనివాస రావు, పొలిట్ బ్యూరో సభ్యుడు కాల్వ శ్రీనివాసులు వెల్లడించారు. మూడు గంటలపాటు జరిగిన ఈ సమావేశంలో ప్రజా రాజధాని మిగతా.. 7లో

## ఎర్ర చందనం రక్షణకు సహకారం... ఏనుగుల సమస్యకు పరిష్కారం



- ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

**బెంగళూరు, మహానాడు:**
కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పాలకులు, అధికారులు చేతులు కలిపితే ఉభయ రాష్ట్రాలు ఎంతో ప్రగతి సాధిస్తాయని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభిప్రాయ పడ్డారు. ఈ మేరకు పవన్ గురువారం బెంగళూరులో కర్ణాటక అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ బి. ఖండ్రేతో, కర్ణాటక అటవీ అధికారుల సమావేశం తర్వాత మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

కర్ణాటక - ఆంధ్రప్రదేశ్ మధ్య ఎల్లప్పుడూ సుహృద్భావ వాతావరణం ఉంటుంది. మిగతా.. 2లో



## 'స్కిల్ సెన్సెస్'తో యువతకు ఉపాధి అవకాశాలు మెండు

- స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష

**అమరావతి, మహానాడు:**
యువతలో నైపుణ్యాలను గుర్తించి వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపర్చే లక్ష్యంతో దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో స్కిల్ సెన్సెస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నట్టు రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న స్కిల్ సెన్సెస్ విధివిధానాల రూపకల్పనపై స్కిల్ డెవలప్ మెంట్ అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... స్కిల్ సెన్సెస్ పూర్తి చేయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

నిర్దేశిత సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆన్ లైన్ విధానంలో స్కిల్ సెన్సస్ వివరాలు సేకరిస్తారు. స్కిల్ సెన్సెస్ లో భాగంగా వివరాలను సేకరించి, వారిలో నైపుణ్యాభివృద్ధికి చర్యలు తీసుకోవడం, ఉపాధి అవకాశాలు కల్పించడం, తద్వారా వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చడడం ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశమని తెలిపారు. తొలుత ఒక నియోజకవర్గంలో మిగతా.. 2లో

## త్వరలో జన్మభూమి-2

- అతి త్వరలో నామినేటెడ్ పోస్టులు భర్తీ
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

**అమరావతి,**
జన్మభూమి కార్యక్రమాలు తిరిగి ప్రారంభించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు.

గురువారం సోమిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. త్వరలో జన్మభూమి-2 కార్యక్రమం మొదలు కానున్నట్లు తెలిపారు.






జన్మభూమి 2 కార్యక్రమాన్ని సక్సెస్ చేసేందుకు ఎన్నారైలు, పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పొలిట్‌బ్యూరోలో 55 రోజుల పాలనపై చర్చించినట్లు తెలిపారు. నామినేటెడ్ పోస్టులు అతి త్వరలో భర్తీ చేస్తామని, ఇసుకలో అక్రమాలు సహించబోనని అధినేత చంద్రబాబు మరోసారి హెచ్చరించారన్నారు. వర్షాలతో ప్రాజెక్టులన్ని నిండుకుండలా ఉన్నాయన్నారు. ప్రాజెక్టులు నిండటంతో జగన్ గుండె నీరుకారుతోందని విమర్శించారు. మిగతా.. 2లో




## హైదరాబాద్‌లో ఛార్లెస్ స్క్వాబ్

- డల్లాస్లో సీఎంతో కంపెనీ ప్రతినిధుల చర్చలు

**హైదరాబాద్, మహానాడు:**
ఫైనాన్షియల్ సర్వీసెస్లో ప్రపంచంలో పేరొందిన చార్లెస్ స్క్వాబ్ కంపెనీ హైదరాబాద్‌లో టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించింది. భారత్లోనే ఈ కంపెనీ నెలకొల్పే మొదటి సెంటర్ ఇదే కావటం విశేషం. అమెరికా పర్యటనలో భాగంగా డల్లాస్‌లో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుతో ఈ కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు డెన్నిస్ హెూవార్డ్, మిగతా.. 2లో

## 2047 లక్ష్యాలను చేరుకోవడంలో ఖనిజ రంగం కీలకం

- సవాళ్లను అధిగమిస్తూ పరిష్కార మార్గాలతో ముందుకెళ్దాం
- గనుల రంగంపై జాతీయ సదస్సులో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి

**న్యూఢిల్లీ, మహానాడు:**
భారతదేశం 2047 నాటికి సంకల్పించుకున్న లక్ష్యాలను చేరుకోవడంలో మన ఖనిజరంగం పాత్ర అత్యంత కీలకమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు. గత పదేళ్లుగా కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణల కారణంగా బొగ్గు, గనుల రంగంలో సానుకూల మార్పులు కనబడుతున్నాయన్నారు. ఢిల్లీలో ఎంజీఎంఐ (మైనింగ్, జియాలజికల్, మిగతా.. 2లో







అధికారుల దృష్టికి 'విశ్వకర్మ' వసూళ్ళు!

3లో



అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించాలి

4లో



అవయవదాతలకు సత్కారాలు అభినందనీయం

4లో



దక్షిణ భారత దేశానికి గోల్డ్ హబ్‌గా మంగళగిరి

9లో

జనం గుండె చప్పుడు

# మహానాడు

2

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ శుక్రవారం 09, ఆగస్టు 2024

# రోడ్లపై దృష్టి

(మొదటిపేజీ తరువాయి..)

సామాన్యులపై ఎలా భారం పడుతుంది? మనం మంచి పనులు చేస్తే ప్రజలు అభినందిస్తారు కదా' అని చంద్రబాబు పార్టీ అధ్యక్షుడు పల్లా ఆందోళన కొట్టిపారేశారు.

జిల్లాల్లో పార్టీ ఆఫీసు లేని చోట్ల, ఆఫీసు నిర్మాణం కోసం ప్రభుత్వ భూములు కేటాయించాలని పల్లా సూచించారు. దానికి స్పందించిన చంద్రబాబు ఎక్కడ అవసరం ఉందో గుర్తించి, దరఖాస్తు చేయమని సూచించారు.

ఇక పేదరిక నిర్మూలన అంశంపై జరిగిన చర్చలో, జనాభా పెరుగుదలపై ఆసక్తికరమైన చర్చ జరిగింది. గతంలో మనం జనాభా పెంచాలని పిలుపునిచ్చామని, కానీ ఇప్పుడు నియోజకవర్గ డీలిమిటేషన్ నేపథ్యంలో జనాభా ఎక్కువ ఉన్న రాష్ట్రాలు దెబ్బతినే ప్రమాదం వచ్చిందని.. మాజీ మంత్రులు యనమల, సోమిరెడ్డి పోలిట్‌బ్యూరో సభ్యులకు వివరించారు. ఈ ప్రకియ వల్ల ఉత్తరాది రాష్ట్రాలు లాభపడుతుండగా, దక్షిణాది రాష్ట్రాలు దారుణంగా నష్టపోతాయని వివరించారు. జనాభా ప్రాతిపదిక ఆధారంగా నిధులు ఇవ్వడం వల్ల, రాష్ట్రాలకు నిధులు గణనీయంగా దెబ్బతినే ప్రమాదం ఉందని వివరించారు.

ఈ సందర్భంగా మనం సింగపూర్ విధానాన్ని ఆదర్శంగా తీసుకోవాలని యనమల సూచించారు. అసలు ఏమీ ఉత్పత్తి కాని సింగపూర్.. కేవలం ఒకే ఒక్క నాయకుడి విజన్–ఆలోచన వల్ల ప్రపంచంలో టాప్–5 దేశంగా ఎదిగిందని ఉదహరించారు.

తర్వాత పేదరిక నిర్మూలన అంశంపై మాట్లాడిన సోమిరెడ్డి.. పేదరిక – నిరక్షరాస్యత నిర్మూలనపై దృష్టి సారించడం మంచిదే అయినప్పటికీ, ఆ కార్యక్రమాన్ని గిరిజన ప్రాంతాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడ ం అవసరమని సోమిరెడ్డి సూచించారు. గిరిజనుల నిరక్షరాస్యత – అమాయకత్వం వల్ల దోపిడీ అక్కడే ఎక్కువగా జరుగుతోందని, అందుకే గత ప్రభుత్వంలో నెల్లూరుకు తాను ఐటిడిఏ తీసుకువచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. తాను ఇప్పటికే ఒక గ్రామం దత్తత తీసుకున్నామని, మరో గ్రామం దత్తత తీసుకోనున్నట్లు బాబుకు వివరించారు.

ఇక పార్టీ సభ్యత్వాలపై మంత్రి లోకేష్ సభ్యులకు వివరించారు. త్వరలో పార్టీ సభ్యత్వాలు చేపడుతున్నామని, వంద రూపాయల సభ్యత్వంతో యాప్ ద్వారా సభ్యత్వం పొందే సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. వారికి జీవితబీమా సౌకర్యం కూడా కల్పిస్తున్నామన్నారు. అతి త్వరలో నామినేటెడ్ పదవుల పంపిణీ తొలి దశ ప్రక్రియ ప్రారంభం అవుతుందని, పార్టీ అధినేత చంద్రబాబునాయుడు వెల్లడించారు. కూటమిలోని పార్టీలకూ న్యాయం చేయాల్సి ఉన్నందున, సర్దుకుపోవలసిన అవసరం ఉందన్నారు. ఆ మేరకు కసరత్తు పూర్తి చేశామని, అతిత్వరలో ఆ జాబితా వెల్లడిస్తామన్నారు. ఇక కొత్తగా పార్టీలో చేరాలనుకునేవారిని చేర్పించుకోవాలని సూచించారు. విశాఖ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో, వైసీపీ నుంచి వస్తున్న వారిని చేర్చుకోవాలన్నారు.

## ఎర్ర చందనం రక్షణకు సహకారం...
# ఏనుగుల సమస్యకు పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి..)

రెండు రాష్ట్రాల అధికారులు పాలకులు కూడా కలిసి పని చేస్తే చాలా సమస్యలు తీరుతాయి.

కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ సరిహద్దు వైపు ఏనుగుల సమస్య అధికంగా ఉంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు కర్ణాటక ప్రభుత్వం ఆంధ్ర ప్రదేశ్ కు తగిన విధంగా సహకారం అందించడం సంతోషం కలిగించింది.

ముఖ్యంగా ఎనిమిది కుంకి ఏనుగులను ఆంధ్రప్రదేశ్‌కు అందించేందుకు కర్ణాటక ప్రభుత్వం అంగీకరించడం శుభ పరిణామం.

నేటి సమావేశంలో ఏడు అంశాలపై చర్చ జరిగింది. ఆంధ్రప్రదేశ్ నుంచి ఎర్రచందనాన్ని అక్రమ రవాణా చేస్తుండగా కర్ణాటక ప్రభుత్వం పట్టుకుంది. రూ. 140 కోట్ల వరకు అక్రమ రవాణా ఎర్రచందనాన్ని కర్ణాటక అటవీ సిబ్బంది పట్టుకున్నారు. ఎర్ర చందనంపై ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు తగిన విధంగా చర్చించి నిర్ణయం తీసుకుంటాం.

అటవీ సంపద రక్షణ కోసం సాంకేతికతను ఎలా ఉపయోగించుకోవాలనే అంశంపైనా సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. ఉపగ్రహ ఆధారిత నిఘాపెట్టి పూర్తిస్థాయి సేవలు వినియోగించుకునే అవకాశాలను భవిష్యత్తులో తీసుకువస్తాం. వన్యప్రాణులను చంపి స్మగ్లింగ్ చేసే వారిని కట్టడి చేసేలా రెండు రాష్ట్రాలు సమష్టిగా ముందుకు వెళ్లాలని నిర్ణయిం చాయి. వన్యప్రాణులను ఇష్టానుసారం వేటాడి స్మగ్లింగ్ చేసే వారిపై కఠినంగా ఉంటాం.

తిరుమల, శ్రీశైలం దేవస్థానాలకు కర్ణాటక నుంచి భక్తులు ఎక్కువగా వస్తుంటారు. వీరికి అవసరమైన యాత్రి సదన్ నిర్మాణాల నిమిత్తం కర్ణాటక ప్రభుత్వం రెండు చోట్ల తగిన విధంగా భూములు కేటాయించాలని కోరింది. దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు దృష్టికి అలాగే క్యాబినెట్ దృష్టికి తీసుకువెళ్తాము.

ఎకో టూరిజం అభివృద్ధి విషయంలో కూడా కర్ణాటక ఆంధ్రప్రదేశ్ ఉమ్మడిగా ఒక పటిష్టమైన కార్యాచరణ రూపొందించుకోవాలని నిర్ణయించాయి.

రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఎం.ఓ.యూ. చేసుకున్నాయి. దానికి అనుగుణంగా భవిష్యత్ కార్యాచరణ ఉంటుంది. అంతర్రాష్ట్ర ఒప్పందం మేరకు రెండు రాష్ట్రాల అటవీ శాఖ అధికారులు తగిన విధంగా పనిచేసేందుకు ప్రణాళిక రూపొందించుకుంటారు.

# త్వరలో జన్మభూమి-2

(మొదటిపేజీ తరువాయి..)

జనాభా నియంత్రణ వలన డీలిమిటేషన్‌లో దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతుందన్నారు. ఒక యూపీలో 140 పార్లమెంటు స్థానాలు వస్తే దక్షిణ భారతదేశం 160 మాత్రమే ఉంటాయన్నారు. జనాభా తగ్గడంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు కూడా తగ్గిపోతాయని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వెల్లడించారు.

### తెలంగాణలో టిడిపి పార్టీ బలోపేతంపై దృష్టి

తెలంగాణలో టిడిపి పార్టీని బలోపేతంపై దృష్టి సారించాలని నిర్ణయించారు.

టీడీపీ పార్టీ సభ్యత్వం రుసుము రూ.100తో ప్రారంభిస్తామని, సభ్యత్వం తీసుకున్న వారు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి 5 లక్షలు వచ్చే విధంగా పరిహారం ఉండాలని నిర్ణయించారు.

పేదరిక నిర్మూలనపై ప్రధానంగా చర్చ జరిగింది. త్వరలో పేదరిక నిర్మూలనపై విధివిధానాలు రూపొందిస్తామని సమావేశంలో నిర్ణయించారు.

విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నవారిని పేదరిక నిర్మూలన కార్యక్రమంలో భాగస్వాము లుగా చేయాలని నిర్ణయించారు. ఎస్సీ వర్గీకరణకు జిల్లాను యూనిట్‌గా తీసుకుంటామని సమావేశంలో చర్చించారు.

# సీనియర్ ఐపీఎస్ అధికారులకు, అదనపు డీజీలకు ప్రమోషన్లు

హైదరాబాద్, మహానాడు:

తెలంగాణలో సీనియర్ ఐపీఎస్ అధికారులకు, అదనపు డీజీలకు ప్రమోషన్లు ఇచ్చింది ప్రభుత్వం. ఇంటెలిజెన్స్ డీజీగా శివధర్ రెడ్డి, జైళ్ల శాఖ డీజీగా సౌమ్య మిశ్రా, డీజీ కేడర్‌లో హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస రెడ్డి,

సీఐడీ డీజీగా షికా గోయల్, తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా అభిలాష బిస్త్ పదోన్నతలు పొందిన వారిలో ఉన్నారు.

# జోగి రమేశ్‌ను అదుపులోకి తీసుకుంటేనే కుట్ర కోణం వెలుగులోకి వస్తుంది

**హైకోర్టులో ఏపీ పోలీసుల వాదన**

**వైసీపీ హయాంలో చంద్రబాబు ఇంటిపై దాడి**

**జోగి రమేశ్ ప్రోద్బలంతోనే టీడీపీ అధినేత ఇంటిపై 30-40 మంది దాడిచేశారని ఆరోపణ**

**ముందస్తు బెయిలు కోసం హైకోర్టును ఆశ్రయించిన మాజీ మంత్రి**

**విచారణను ఈ నెల 13కు వాయిదా వేసిన న్యాయస్థానం**

అమరావతి, మహానాడు:

గత ప్రభుత్వ హయాంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఇంటిపై జరిగిన దాడి కేసులో కుట్రకోణం ఉందని, దానిని వెలికి తీయాలంటే వైసీపీ నేత, మాజీమంత్రి జోగి రమేశ్‌ను అదుపులోకి తీసుకుని విచారించాల్సి ఉంటుందని పోలీసుల తరపు సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ్ లూథ్రా, పోసాని వెంకటేశ్వర్లు ఏపీ హైకోర్టుకు తెలిపారు. పిటిషనర్ అయిన జోగి రమేశ్ ప్రోద్బలంతో 30 నుంచి 40 మంది చంద్రబాబు ఇంటి వద్దకు వచ్చి దాడిచేశారని.. బయటకొస్తే చంపేస్తామంటూ చంద్రబాబును బెదిరించారని పేర్కొన్నారు.

ఈ ఘటనపై అప్పట్లో నామమాత్రపు కేసులు పెట్టి కేసును నీరు గార్చేందుకు ప్రయత్నించారని కోర్టుకు తెలిపారు. అంతేకాదు పిటిషనర్, ఆయన అనుచరుల దాడిలో గాయపడిన వారిపైనే తిరిగి అట్రాసిటీ కేసులు పెట్టారని కోర్టుకు వివరించారు. పిటిషనర్ జోగి రమేశ్‌కు ముందస్తు బెయిలు పొందే అర్హత కూడా లేదని తెలిపారు. వాదనల అనంతరం విచారణను కోర్టు ఈ నెల 13కు వాయిదా వేసింది.

చంద్రబాబు నివాసంపై దాడి కేసులో తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేయడంతో జోగి రమేశ్ ముందస్తు బెయిలు కోసం హైకోర్టును ఆశ్రయించారు. రాజకీయ కక్షతోనే తన క్లయింట్‌పై కేసు నమోదు చేశారని జోగి రమేశ్ తరపు న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. నిన్న విచారణ సమయం ముగియడంతో విచారణను న్యాయస్థానం 13కు వాయిదా వేసింది.

# వర్గీకరణ రాజ్యాంగ ఉల్లంఘన కాదు

(మొదటిపేజీ తరువాయి..)

వర్గీకరణ లక్ష్యంతో సంబంధం కలిగి ఉన్నపుడు వర్గీకరణ చేపట్టవచ్చని చెప్పారు. నిజమైన సమానత్వాన్ని సాధించడానికి ఉప వర్గీకరణ మార్గం అయినపుడు వర్గీకరణ రాజ్యాంగ బద్ధమే అవుతుందన్నారు. లభిస్తున్న డేటాను బట్టి చూస్తే ఎస్సీ కులాల మధ్య కూడా అసమానతలు ఉన్నాయని, ఆ కులాలు వర్గంగా అవతరించిన ఒకేరకమైన కులాలు కాదని చెప్పారు.

ఎస్సీ కులాలను ఆర్టికల్ 341 ద్వారా కలిపినంత మాత్రాన విభజించడం కుదరనంత ఏకరూప వర్గంగా అవి ఏర్పడవని అన్నారు. కేవలం చట్టపరంగా ఇతర కులాలతో వేరు చేసి చూపడమనే పరిమిత లక్ష్యంతోనే ఎస్సీ కులాలను ఆర్టికల్ 341 రూపంలో ఒకచోట కలిపారని వివరించారు.

వెనుకబాటుతనం, ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం విషయంలో గణించదగ్గ, విశ్వసనీయమైన సమాచారం ఆధారంగానే వర్గీకరణ చేయవచ్చని చెప్పారు.

ఇప్పటికే ఎస్సీ కులాల జాబితాలో ఉన్న ఏ కులానికైనా ఎస్సీ కులాలకు వర్తించే లబ్ధి చేకూరకుండా వర్గీకరణ చేపడితే రాజ్యాంగ విరుద్ధం అవుతుందని స్పష్టం చేశారు. బాగా వెనుకబడిన కులాలకు అధిక ప్రాధాన్యం లభించేట్లు చూడాల్సిన రాష్ట్ర ప్రభుత్వాలదేనని జస్టిస్ గవాయ్ అన్నారు. ఎస్సీ, ఎస్టీల్లో కొంతమంది వ్యక్తులే రిజర్వేషన్ ఫలాలను అనుభవిస్తున్నారని వ్యాఖ్యానించారు.

వందల ఏళ్ల అణచివేతను ఎదుర్కొన్న ఎస్సీ, ఎస్టీ కులాల్లోనూ అంతరాలు ఉన్నాయని, క్షేత్ర స్థాయిలో కనిపిస్తున్న వాస్తవాలను కాదనలేమని చెప్పారు. రిజర్వేషన్లకు రాజ్యాంగంలోని 341 అధికరణే ప్రాతిపదిక అని ఈవీ చిన్నయ్య కేసులో సుప్రీంకోర్టు భావించడమే మౌలిక లోపమని జస్టిస్ గవాయి వ్యాఖ్యానించారు. రిజర్వేషన్ల కోసం కులాలను గుర్తించే పని మాత్రమే ఆర్టికల్ 341 చేస్తుందని చెప్పారు. ఒక పెద్ద వర్గంలో భాగమైన మరో ఉపవర్గం వివక్షను ఎదుర్కొంటున్నందుకే ఉప వర్గీకరణ చేయాల్సి వస్తోందని తెలిపారు.

# రైతులకు విత్తనాల కొరత లేకుండా చూడండి

(మొదటిపేజీ తరువాయి..)

రైతుకు నికరాదాయాన్ని పెంచే రీతిలో సమగ్ర విధానాన్ని రూపొందించాలన్నారు.

పంట పొలాల్లో పురుగు మందులు పిచికారి వంటి వాటికి డ్రోన్ వినియోగాన్ని పెంచాలని సూచించారు. కేంద్ర పౌర విమానయాన శాఖతో మాట్లాడి రాష్ట్రంలో డ్రోన్ టెస్టింగ్ కేంద్రం ఏర్పాటుకు కృషి చేద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు చెప్పారు. నేలల్లో తేమను గుర్తించేందుకు శాటిలైట్ సేవలను వినియోగించు కోవాలని సీఎం సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత పథకానికి సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేస్తామన్నారు.

ఉద్యానవన పంటల్లో దేశంలోనే రాష్ట్రం ముందుండేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. రాష్ట్రంలో అరటి, మామిడి, నిమ్మ, ఆయిల్ ఫామ్, కొబ్బరి, కాఫీ, టమోటా వంటి పంటల సాగులో దేశంలో మొదటి నాలుగు స్థానాల్లో ఉన్నామని, రానున్న రోజుల్లో ఉద్యానవన పంటల్లో దేశంలో అగ్రగామిగా ఉండేదుకు తగిన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఉద్యానవన శాఖపై జరిగిన సమీక్షలో అధికారులు పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ వచ్చే రెండు మూడేళ్లలో ఉద్యానవన పంటల్లో ఉత్పత్తి, ఉత్పాదకత గణనీయంగా పెంచి రైతులకు ఆదాయం పెరిగేలా చూడాలని సూచించారు. ఇందుకు గాను 2014–19 కాలంలో అమలు చేసిన ఉద్యానవన పంటల విధివిధానాలను పూర్తిగా అనుసరించాలని స్పష్టం చేశారు. 15 శాతం జీఎస్డీపీని సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఉద్యానవన పంటల ప్రోత్సాహానికి సంబంధించి అవసరమైన మౌలిక సదుపాయల కల్పన, మార్కెటింగ్, లాజిస్టిక్ సౌకర్యాలు, కోల్డ్ స్టోరేజీలు,తక్కువ ఖర్చుతో రవాణా వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. 2024–25లో లక్ష ఎకరాలను సూక్ష్మ సేద్యం కింద అదనంగా సాగులోకి తేవాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు వివరించారు. ఆయిల్ ఫామ్, కొబ్బరి, కోకో వంటి పంటల్లో మెరుగైన ఉత్పత్తి సాధించేందుకు సమగ్రమైన విధానాలు అవలంభించాలని అన్నారు. రాష్ట్రంలో మైక్రో ఇరిగేషన్ పరికరాల మ్యాన్ ఫ్యాక్చరింగ్ పార్కు ఏర్పాటు చేయాలని గతంలో ప్రతిపాదించామని, దానిని ఆచరణ సాధ్యం చేసేందుకు వెంటనే తగిన ప్రయత్నం చేయాలని ఆదేశించారు. ఫుడ్ ప్రాసెసింగ్ కు సంబంధించి ఉత్తమ విధానాన్ని తీసుకొచ్చేందుకు నివేదక సిద్ధం చేయాలని చెప్పారు.

అనంతరం సహకార శాఖపై సమీక్ష జరగ్గా ఆ శాఖ కమిషనర్ ఎ.బాబు వివరిస్తూ ప్రసుత్తం రాష్ట్రంలో 13 డీసీసీబీలు ఉన్నాయని, ప్రతి జిల్లాకు ఒక డీసీసీబీని ఏర్పాటు చేయాల్సి ఉందని సీఎం దృష్టికి తీసుకొచ్చారు.

ప్రాథమిక సహకార సంఘాల ద్వారా ప్రస్తుతం 24 పెట్రోల్ అవుట్ లెట్లు నిర్వహిస్తుండగా ఆయిల్ కంపెనీల నుండి మరో 64 ఎన్ఓసిలు వచ్చాయన్నారు.

ఈసమావేశంలో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి–మత్స్య శాఖామాత్యులు కె.అచ్చెన్నాయుడు అధికారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో ఛార్లెస్ స్క్వాబ్

(మొదటిపేజీ తరువాయి..)

రామ బొక్కా సారథ్యంలో ప్రతినిధులు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా టెక్నాలజీ అండ్ డెవెలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుపై కీలక నిర్ణయాన్ని వెల్లడించారు.

హైదరాబాద్‌లో ఈ కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. కంపెనీ కార్యకలాపాలను వేగవంతం చేసేందుకు అవసరమైన మార్గదర్శనం చేస్తామని చెప్పారు. తమ కంపెనీ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతుకు కంపెనీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు ఛార్లెస్ స్క్వాబ్ తుది అనుమతుల కోసం వేచి చూస్తోంది. త్వరలోనే తమ ప్రతినిధి బృందాన్ని హైదరాబాదుకు పంపించనున్నట్టు తెలిపింది. ఈ కంపెనీ విస్తరణతో ఆర్థిక సేవల రంగంలోనూ హైదరాబాద్ ప్రపంచం దృష్టిని ఆకర్షించనుంది.

# 2047 లక్ష్యాలను చేరుకోవడంలో ఖనిజ రంగం కీలకం

(మొదటిపేజీ తరువాయి..)

మెటలర్జికల్ ఇనిస్టి ట్యూట్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో.. గనులరంగంపై జరిగిన జాతీయ సదస్సులో విశిష్ట అతిథిగా పాల్గొన్న కేంద్రమంత్రి.. గనుల రంగంలో ఎదురవుతున్న సవాళ్లు, వాటిని పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణల గురించి వివరించారు.

భారతదేశపు తలసరి విద్యుత్ వినియోగం ప్రపంచ సగటుతో పోల్చుకుంటే.. మూడోవంతుగా ఉందన్న కేంద్రమంత్రి.. భారతదేశంలో పెరుగుతున్న పారిశ్రామికీ కరణ, అభివృద్ధి కారణంగా రానున్న రోజుల్లో ప్రపంచ సగటును భారత్ చేరుకోవడం ఖాయమన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని భారతదేశంలో విద్యుదుత్పత్తిని పెంచేందుకు బొగ్గు ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. భారతదేశంలో గనుల తవ్వకం విషయంలో..మొదటి దశ అయిన ఎక్స్‌ప్లొరేషన్ ప్రక్రియలో రిస్క్ తీసుకునేందుకు కంపెనీలు ముందుకు రావడం లేదని.. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ఎక్స్‌ప్లొరేషన్ ప్రక్రియలో 50% ఖర్చును భరించేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా కిషన్ రెడ్డి గుర్తుచేశారు. గనుల రంగంలో ఆత్మనిర్భరత సాధించేందుకు ఇలాంటి నిర్ణయాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

'బలమైన, సమర్థవంతమైన గనుల రంగాన్ని ఏర్పాటు చేసుకోకుండా.. భారతదేశం ఆత్మనిర్భరత సాధించడం సాధ్యం కాద'న్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ గారి మాటలను గుర్తుచేస్తూ.. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం అన్ని సాధ్యమైన చర్యలు చేపడుతోందన్నారు. యూపీయే ప్రభుత్వంలో గనుల కుంభకోణాన్ని దృష్టిలో ఉంచుకుని, పారదర్శకమైన పద్ధతిలో వేలం విధానాన్ని మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు.

ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనూ కేంద్ర ప్రభుత్వం 'క్రిటికల్ మినలర్ మిషన్', 'ఆఫ్ సోర్ మినరల్ బ్లాక్స్ వేలం' వంటి సంస్కరణలు తీసుకొచ్చిన విషయాన్ని కిషన్ రెడ్డి ప్రస్తావించారు. దీని ద్వారా కీలకమైన ఖనిజాల విషయంలో దిగుమతులపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుందన్నారు. దీనికితోడుగా విదేశాల్లోని గనులను లీజ్‌కు తీసుకునే విషయంలోనూ ప్రగతి సాధించామన్నారు.

భారతదేశంలో కోకింగ్ కోల్ దిగుమతిని తగ్గించేందుకు.. 'మిషన్ కోకింగ్ కోల్' కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. 2030 నాటికి 140 మిలియన్ టన్నుల కోకింగ్ కోల్ ఉత్పత్తి ఈ మిషన్ లక్ష్యమని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. అభివృద్ధికి, ఖనిజాల ఉత్పత్తికి ప్రాధాన్యతనిస్తూనే.. పర్యావరణ పరిరక్షణపైనా ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు.

ఖనిజరంగాభివృద్ధిలో ప్రైవేటు రంగం పాత్ర కీలకమన్నారు. క్లీన్ ఫ్యుయల్ నుప్రోత్సహించే దిశగా.. కోల్ గ్యాసిఫికేషన్, కోల్ బెడ్ మిథేన్ గ్యాసెస్ ఎక్స్‌ట్రాక్షన్, కోల్ నుంచి హైడ్రోజన్ ఎక్స్‌ట్రాక్ట్ చేయడం, కార్బన్ క్యాప్చర్ అండ్ స్టోరేజ్ తదితర మిషన్లలో ప్రైవేటు రంగం ప్రత్యేక చొరవతీసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ సహాయ మంత్రి సతీశ్ చంద్ర దూబే, గనుల శాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావ్, బొగ్గు శాఖ అదనపు కార్యదర్శులు, కోల్ ఇండియా చైర్మన్ పీఎం ప్రసాద్, ఎంజీఎంఐ అధ్యక్షుడు డాక్టర్ వీరారెడ్డితోపాటుగా బొగ్గు,గనుల రంగానికి చెందిన ప్రముఖులు, ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రయివేటు గనుల యజమానులు పాల్గొన్నారు.

అనంతరం ఆయా సంస్థల సీఈవోలు, చైర్మన్లతో జరిగిన సమావేశంలో.. గనుల రంగం ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కారాలు, తీసుకురావాల్సిన సంస్కరణలు తదితర అంశాలను కిషన్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే కేంద్రప్రభుత్వం చేపట్టిన పనుల కారణంగా వచ్చిన సానుకూల మార్పులను కిషన్ రెడ్డి గుర్తుచేశారు. అందరి సహకారంతో భారతదేశాన్ని గనులు, ఖనిజాల రంగంలో ఆత్మనిర్భర్‌గా మార్చేందుకు కృషిచేస్తామని పేర్కొన్నారు.

# 'స్కిల్ సెన్సెస్'తో యువతకు ఉపాధి అవకాశాలు మెండు

(మొదటిపేజీ తరువాయి..)

పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టి, తర్వాత రాష్ట్రవ్యాప్తంగా దీనిని చేపట్టేందుకు ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు. మరింత మెరుగైన ఫలితాల కోసం అవసరాన్ని బట్టి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ను కూడా ఉపయోగించాలని అన్నారు.

స్కిల్ సెన్సెస్‌లో భాగంగా ఆయారంగాల్లో ఆసక్తి ఉన్న యువతను గుర్తించి శిక్షణ ఇచ్చాక, వారికి ప్రఖ్యాత సంస్థలతో సర్టిఫికేట్‌ను కూడా అందజేస్తారు. రాష్ట్రంలోని పరిశ్రమలతోపాటు నౌక్రీ డాట్.కామ్, లిన్క్ డిన్ వంటి పోర్టల్స్ ద్వారా మెరుగైన అవకాశాలను పొందడానికి ఈ సర్టిఫికేషన్ ఉపయోగపడుతుందని తెలిపారు.

స్థానికంగా అందుబాటులో లేకపోయినప్పటికీ ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాల్లో విద్యను అభ్యసిస్తున్న యువతీయువకులు కూడా ఆన్‌లైన్ ద్వారా స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకునేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

యువతలో నైపుణ్యాలను డిజిటలైజ్ చేసి అవకాశాలను మెరుగుపర్చడమే స్కిల్ సెన్సెస్ లక్ష్యమని చెప్పారు. ఇందులో భాగంగా ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇవ్వాలని, యువతను చైతన్యవంతం చేయాలని సూచించారు. సర్వే అంశాలు సాధ్యమైనంత సులభంగా ఉండేలా చూడాలని అన్నారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో జరిగే సమావేశంలో విధివిధానాలు ఖరారు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఐటి అండ్ ఎలక్ట్రానిక్స్ శాఖల కార్యదర్శి సౌరబ్ గౌర్, స్కిల్ డెవలప్ మెంట్ ఎండి జి.గణేష్ కుమార్, న్యాక్ ఎడిజి దినేష్ కుమార్, సీడాప్ సిఇఓ శ్రీనివాసులు, ఓం క్యాప్ ఎండి క్రాంతి పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
3
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 09, ఆగస్టు 2024

# 6.5 శాతం వద్దే రెపోరేటు..

ముంబయి, మహానాడు:


విశ్లేషకుల అంచనాలకు అనుగుణంగానే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) కీలక రేట్లను యథాతథంగా కొనసాగించింది. మంగళవారం ప్రారంభమైన పరపతి విధాన కమిటీ(ఎంపీసీ) సమావేశ నిర్ణయాలను గవర్నర్ శక్తికాంత దాస్ గురువారం ప్రకటించారు. రెపోరేటును 6.5 శాతం వద్ద కొనసాగిస్తున్నట్టు వెల్లడించారు. 2023 ఫిబ్రవరి నుంచి కేంద్ర బ్యాంకు దీన్ని అలాగే కొనసాగిస్తూ వస్తోంది. ఎలాంటి మార్పు చేయకపోవడం వరుసగా ఇది తొమ్మిదో సారి. ఎంపీసీ కీలక నిర్ణయాలిలావున్నాయి.

మార్కెట్ అంచనాలు, ఆర్‌బీఐ విధానాలకు మధ్య సయోధ్య కుదురుతోంది. ఏప్రిల్ – మే లో స్థిరంగా ఉన్న ద్రవ్యోల్బణం.. జూన్‌లో మళ్లీ పెరిగింది. ఆహార పదార్థాల ధరలు పెరగడమే దీనికి కారణం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ విస్తరణ అసమ తుల్యంగా ఉంది. కొన్ని కేంద్ర బ్యాంకులు ఇంకా కఠిన విధానాలను కొనసాగిస్తున్నాయి. పెరుగుతున్న అప్పులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు సవాల్‌గా మారాయి.. భారత సేవా రంగ కార్య కలాపాలు బలంగా ఉన్నాయి. బ్యాంకు రుణాల విస్తరణ నేపథ్యంలో ప్రైవేటు కార్పొరేట్ పెట్టుబడులు ఊపందు కుంటున్నాయి. బ్యాంకులు, కార్పొరేట్ల బ్యాలెన్స్ షీట్లు ఆరోగ్యకరంగా ఉన్నాయి. ప్రభుత్వం మూలధనం వ్యయాలపై దృష్టి సారిస్తోంది. ఈ నేపథ్యంలో పెట్టుబడి అవకాశాలు ఆశాజనకంగా ఉన్నాయి.

2024–25లో వాస్తవ జీడీపీ వృద్ధిరేటు అంచనా 7.2 శాతం. ఒకటి, రెండు, నాలుగో త్రైమాసికంలో 7.2 శాతం, మూడో క్వార్టర్‌లో 7.3 శాతంగా ఉండే అవకాశం. నైరుతి రుతు పవనాల వల్ల ఆహార ద్రవ్యోల్బణం దిగొస్తుందని ఆశా భావం. 2024–25లో ద్రవ్యోల్బణం 4.5 శాతంగా అంచనా. రెండో త్రైమాసికంలో 4.4%, మూడో త్రైమాసికంలో 4.7%, నాలుగో త్రైమాసికంలో 4.3 శాతంగా ఉండే అవకాశం. భారత కరెన్సీ రూపాయి మారకం విలువ పరిమిత శ్రేణి లోనే కదలాడుతోంది.

ఆగస్టు రెండు నాటికి భారత విదేశీ మారక నిల్వలు 675 బిలియన్ డాలర్ల వద్ద రికార్డు స్థాయికి చేరాయి. రిటైల్ ఇన్వెస్టర్లకు ప్రత్యామ్నాయ పెట్టుబడి అవకా శాలు పెరుగుతున్న నేపథ్యంలో బ్యాంకుల డిపాజిట్లు తగ్గుతు న్నాయి. దీంతో, బ్యాంకులు క్రెడిట్ డిమాండ్‌ను అందు కోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

కుటుంబాల పొదుపులను ఆకర్షించడంపై బ్యాంకులు దృష్టి సారించాలి. వ్యక్తిగత రుణ వితరణలో గణనీయ వృద్ధి.



దీన్ని జాగ్రత్తగా పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. ఆర్థిక సంస్థలు కొన్నిసార్లు టాపప్ లోన్లు, బంగారు రుణాలను ఇవ్వ డంలో నిబంధనలను పాటించడం లేదు. దీన్ని బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీ లు అరికట్టాలి.

ఇటీవల గ్లోబల్ టెక్ ఔటేజ్.. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ప్రత్యామ్నాయ వ్యవస్థల ఏర్పాటు ప్రాముఖ్యతను గుర్తు చేసింది. యూపీఐ పన్ను చెల్లింపు పరిమితి రూ. 1 లక్ష నుంచి రూ. 5 లక్షలకు పెంపు. నిరంతర చెక్ క్లియరింగ్‌ను ప్రవేశ పెట్టాలని ప్రతిపాదన. 2022–23లో జీడీపీలో 2 శాతంగా ఉన్న కరెంటు ఖాతా లోటు 2023–24 నాటికి 0.7 శాతానికి తగ్గింది.

## ఆర్బీఐ మరో కీలక నిర్ణయం

ముంబాయి, మహానాడు:

ఆర్బీఐ మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఆ వివరాలివి. యూపీఐ ట్యాక్స్ పేమెంట్ లిమిట్ రూ.5 లక్షలకు పెంపు. యూపీఐ ట్యాక్స్ పేమెంట్స్ లిమిట్ రూ. 1లక్షగానే ఉంది. ఇప్పుడు దీనిని ఒకేసారి ఒక్కో ట్రాన్సాక్షన్‌కు రూ.5 లక్షలకు పెంచుతున్నట్లు వెల్లడించిన ఆర్బీఐ. ఆర్బీఐ తాజా నిర్ణయంతో పెద్ద మొత్తంలో టాక్స్ చెల్లించేవారు ఏ ఇబ్బం దులు లేకుండా రూ. 5 లక్షల వరకు యూపీఐతోనే టాక్స్ పేమెంట్స్ చేసుకోవచ్చని తెలిపింది. యూపీఐతో చేసే చెల్లింపులపై ఎలాంటి అదనపు ఛార్జీలు పడవు. కానీ డెబిట్ కార్డులు లేదా క్రెడిట్ కార్డులతో చేసినప్పుడు మారుతుంది. కార్డు ద్వారా పేమెంట్స్ చేస్తే ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది.

# పార్టీలకు అతీతంగా ప్రాంతాల అభివృద్ధి

- రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి

నెల్లూరు, మహానాడు:

ఎన్నికల వరకే రాజకీయాలు.. ఆ తరువాత కులాలకు, మతా లకు, పార్టీలకు అతీతంగా ప్రాంతాల అభివృద్ధికి అంకితమవు తున్నాయమని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 33వ డివిజన్, వెంగళరావు నగర్ లో షుమారు 20 లక్షల రూపాయల నిధులతో సి.సి. రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కరణం మంజుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

రాబోయే రెండు నెలల్లో 33వ డివిజన్ అభివృద్ధికి కోటి రూపాయలు మంజూరు చేస్తాం. రాజకీయ విభేదాలు పక్కనపెట్టి ప్రాంతాల అభివృద్ధికి అందరం ప్రశాంత వాతావరణంలో పని చేసుకుందాం. నా లక్ష్యం ఒక్కటే... ఎన్డీఏ ప్రభుత్వంలో అందించే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందాలి. గత ముఖ్య మంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి అనాలోచిత నిర్ణయాలతో ఆర్థికంగా దివాళా తీసిన ఆంధ్ర రాష్ట్రాన్ని నేడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గాడిన పెడుతున్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలలో ముఖ్యంగా ప్రజా భాగస్వామ్యం ప్రజల సహకారం



అవసరం.

కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జులు మన్నెం పెంచల నాయుడు, జలదంకి సుధాకర్, టీడీపీ నాయకులు హజరత్ నాయుడు, బీజేపీ నాయకులు మండ్ల ఈశ్వరయ్య, టిడిపి నాయకులు వెంకట రమ ణయ్య, మెట్టు క్రాంతి, రమణయ్య నాయుడు, డిష్ చిన్న, నాని, కళ్యాణి, నిర్మలమ్మ, మౌలాలి, ఆనంద్, లాల్ మస్తాన్, కిషోర్ రాజు, సుబ్బయ్య, అశోక్, రమేష్ రెడ్డి, అభి, హరి, దాసరి పెంచ లయ్య, మజీద్, అస్లాం, షేక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల దృష్టికి 'విశ్వకర్మ' వసూళ్లు!

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేంద్ర

గుంటూరు, మహానాడు:

గుంటూరు జిల్లా బిజెపి నాయకులు విశ్వకర్మ యోజన పథ కానికి సంబంధించి ఎంఎస్ఎంఇ ఆఫీసులో జిల్లా ఆఫీసర్ వెంక ట్రావు, డిప్యూటీ డైరెక్టర్ సుధాకర్ని కలిసి జిల్లాలో జరుగుతున్న కొన్ని వాస్తవాలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ వారితో మాట్లాడుతూ జిల్లాలో ఈ విశ్వకర్మ యోజన పథ కాన్ని ఆసరాగా తీసుకొని సీఎస్‌సీ సెంటర్సు ఒక్కొక్క అప్లికేషన్స్ కి 300 రూపాయల దాకా తీసుకుంటున్నారని, అలాగే మోడీ కుట్టు మిషన్లు ఇస్తారు అని చెప్పి చాలామంది మహిళల దగ్గర అప్లికేషన్ కోసం డబ్బులు తీసుకుంటున్నారని, అలాగే కింద స్థాయి అధికా రులు, సచివాలయం సిబ్బంది ఈ పథకం మీకు కన్ఫర్మ్ అయింది అని చెప్పి ఇది మీకు రావాలి అంటే క్యాస్ట్, ఇన్కమ్, లేబర్ లైసెన్సు సర్టిఫికేటు అడుగుతున్నారని కొంతమంది లబ్ధిదారులు మా దృష్టికి వచ్చిందని ఆగ్రహించారు.

ఈ విషయాలపై స్పందించాలని కోరారు. జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ ఈ పథకం అయిదేళ్ళ వరకు ఉంటుందని, కొంత మంది అధికారులు పలానా రోజు ఆఖరు తేదీ అని మాయ మాటలు చెబుతున్నారన్నారు. ప్రజలందరూ దళారుల మాటలు నమ్మవద్దని అన్నారు.

వెంటనే వారు పైన చెప్పిన విషయాలపై కింద స్థాయి అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటా మని హామీ



ఇచ్చారు. అధికారులని కలిసిన వారిలో రాష్ట్ర వివర్ సెల్ కన్వీనర్ జగ్గారపు శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చరక కుమార్ గౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు తుళ్ళిమిళ్ళి రామకృష్ణ, ఆవుల రామ కోటేశ్వరరావు ,మోతే శేషగిరి కామేపల్లి వెంకటేశ్వర్లు, కన్నా రవి దేవరాజు, వీరేంద్ర కుమార్ ఉన్నారు.



# ఐటీ పరిశ్రమల స్థాపన కోసం టాప్-10 పారిశ్రామికవేత్తలతో చర్చిస్తాం

- ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ అధికారులతో మంత్రి లోకేష్

ఉండవల్లి, మహానాడు:

రాష్ట్రంలో ఐటీ అభివృద్ధి, పరిశ్రమల స్థాపన కోసం దేశంలోని టాప్–10 పారిశ్రామికవేత్తలతో చర్చించనున్నట్టు విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీ శాఖల మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. ఉండవల్లిలోని నివాసంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. పెట్టు బడి దారులను ఆకర్షించడం, మౌలిక సౌకర్యాల కల్పనపై అధికారులతో చర్చించారు. రియల్ టైం గవర్నెన్స్‌ను (ఆర్టీజీఎస్) మరింత మెరుగ్గా రూపుదిద్దాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు. తిరుపతి, పరిసర ప్రాతాల్లో ఎలక్ట్రానిక్ క్లస్టర్లను అభివృద్ధి చేయడంతో పాటు విడిభాగాలు తయారు చేసే యూనిట్స్‌ను నెలకొల్పేందుకు కృషిచేయాలన్నారు.

ఇన్నోవేషన్ సెంటర్స్‌లో ప్రోత్సహకాలు అందించి స్టార్టప్ లకు అవసరసమైన ఎకో సిస్టమ్‌ను మరింత మెరుగుపం చాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఐటీ సెక్రటరీ సౌరభ్ గౌర్, ఎండీ ఏపీటీఎస్ రమణారెడ్డి, కమ్యూనికేషన్స్ డైరెక్టర్ డి.వెంకటాచలం, ఐటీ జాయింట్ సెక్రటరీ సూర్జిత్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

# అన్నా క్యాంటీన్లు, టిడ్కో ఇళ్ళు మంత్రి పరిశీలన

చిలకలూరిపేట, మహానాడు:

పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలో ఈ నెల 15వ తేదీన ప్రారంభించనున్న అన్నా క్యాంటీన్ ను మున్సిపల్ శాఖామంత్రి పి. నారాయణ గురువారం పరిశీలించారు. అనంతరం టిడ్కో గృహాలను సందర్శించి, లబ్దిదారుల సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన బస్సు ను ప్రారంభించారు. ఇది చిలకలూరిపేట నుండి నరసరావుపేట వయా టిడ్కో గృహాల మీద గా వెళ్లనున్నది. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు కూడా వున్నారు.

ఈ సందర్భంగా ఎంఎల్ఏ పుల్లారావు



మాట్లాడుతూ... ఈ రోజు మంత్రి నారాయణ టిడ్కో లబ్ధిదారులకు వరాల జల్లు కురిపించారని అన్నారు. లబ్ధిదారుల సౌకర్యం కోసం ఒక ఆసుపత్రి, కమ్యూనిటీ హాలు, పాఠశాల ఏర్పాటుకు ఆయన ఆమోద తెలిపారని అన్నారు. అలాగే 300 గజాలలో గృహాలు తీసుకున్న లబ్ధిదారులకు ఏటువంటి లోన్ లేకుండా ఉచితంగా ఇస్తున్నట్టు తెలిపారన్నారు. లబ్ధిదారులు గృహాలను అమ్మటం లేక అద్దెల కివ్వటం చేయరాదని తెలిపారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ... భారతదేశంలోనే మొట్టమొదట షేర్వాల్ టెక్నాలజీతో ఈ గృహాలు నిర్మించామని అన్నారు.



దీనికి మాములుగా అయ్యా ఖర్చు కన్నా రెట్టింపు అవుతుందని తెలిపారు. అలాగే లబ్ధిదారుల కోరికమేర కమ్యూనిటీ హాలు, పాఠశాల, ఆసుపత్రి ఏర్పాటు చేస్తామని అన్నారు. మార్చి నెల లోపు వీటిని పూర్తి చేస్తామని అన్నారు. చంద్రబాబు పేదవారి సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు గేటెడ్ కమిటీ తరహాలో వీటిని నిర్మించామని వివరించారు. అలాగే ఆగస్టు 15వ తేదీన 100 అన్నా క్యాంటీన్ లను ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా ప్రారంభించనున్నట్టు తెలిపారు. మిగిలిన వాటిని ఈ నెలాఖరులోగా ప్రారంభిస్తామని తెలిపారు.







# సీఎం చంద్రబాబు పిలుపుతో సామాన్య కార్యకర్తలలో అవధుల్లేని ఆనందం

అమరావతి, మహానాడు:

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక క్షణం తీరిక లేకుండా పాలనా వ్యవహారాల్లో బిజీబిజీగా ఉన్న సీఎం చంద్రబాబు నాయుడు తనపై అంతులేని అభిమానాన్ని కనబరిచిన సాధారణ కార్యకర్తలను పిలుపించుకుని మాట్లాడిన ఆసక్తిర సన్నివేశం గురువారం సచివాలయంలో చోటుచేసుకుంది. ప్రతిపక్షంలో ఉండగా తాను పర్యటనలకు వెళ్లినప్పుడు నిత్యం తనను అను సరించి అభిమానాన్ని చూపించిన ఇద్దరు కార్యకర్తలను గుర్తు పెట్టుకుని మరీ పిలిపించుకుని వారితో మాట్లాడారు.

దెందులూరుకు చెందిన దుర్గాదేవి, వినుకొండకు చెందిన శివరాజు యాదవ్ తెలుగుదేశం పార్టీకి వీరాభిమానులు. చంద్రబాబు నాయుడు ప్రతిపక్షంలో ఉన్న సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ పర్యటనకు వెళ్లినా అక్కడికి వచ్చేవారు. దెందులూరుకు చెందిన దుర్గాదేవి చంద్రబాబును కాన్వాయ్‌తో పాటు స్కూటీపై వచ్చి ఉత్సాహంగా పాల్గొనేది. వినుకొండకు చెందిన శివరాజు యాదవ్ చంద్రబాబు పర్యటనలను ముందు గానే తెలుసుకుని అక్కడికి చేరుకునేవాడు.

గత ప్రభుత్వం చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెట్టిన సమయంలో కూడా ఆ ఇద్దరు కార్యకర్తలు కొన్ని రోజులు రాజమండ్రిలోనే ఉండి బాబు ఎప్పుడు బయటకు వస్తారా అని ఆతృతగా నిరీక్షించారు. తనపై అంతులేని అభిమానాన్ని కనబరిచిన ఆ ఇద్దరిని గుర్తించిన సీఎం వ్యక్తిగత సిబ్బంది ద్వారా ప్రత్యేకంగా పిలిపించుకున్నారు. ఆప్యాయంగా పల కరించి వారి కుటుంబ నేపథ్యాన్ని వాకబు చేశారు. సాక్షాత్తూ తమ అభిమాన నాయకుడే నేరుగా తమతో మాట్లాడటంతో దుర్గాదేవి, శివరాజు యాదవ్ ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. పార్టీ కార్యకర్తలకు చంద్రబాబు ఎంత విలువ ఇస్తారన్నదానికి ఇదొక మచ్చుతునకని పలువురు వ్యాఖ్యానించారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 09, ఆగస్టు 2024

## అంగన్‌వాడీ కేంద్రాలకు
# సొంత భవనాలు నిర్మించాలి

- **కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రికి ఎంపి కేశినేని శివనాథ్ వినతి పత్రం**

ఢిల్లీ, మహానాడు:

విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో 1457 అంగన్ వాడీ కేంద్రాలు వుండగా వాటిలో 892 అంగన్ వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవని అందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణ దేవి కి విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ లోని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణ దేవి ని గురువారం ఆమె ఛాంబర్ లో కలిసి ఎన్.టి. ఆర్ జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలకు సంబంధించి చేయాల్సిన అభివృద్ధి పనుల అనుమతి కోరుతూ విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు.

జిల్లాలో సొంత భవనాలు వుండి ప్రహరీ గోడలు లేని 357 అంగన్వాడీ కేంద్రాలకు ప్రహరీ గోడల నిర్మాణం, అదనంగా మరో 60 అంగన్వాడీ కేంద్రాల ఏర్పాటు, సొంత భవనాలు లేని 892 అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాల్సిందిగా అభ్యర్థించారు. అలాగే విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తం అంగన్వాడీ కేంద్రాల 1457 వుండగా, వీటిలో స్వంత భవనాలు కేవలం 583 అంగన్వాడీ కేంద్రాలకు మాత్రమే వున్నట్లు తెలియపర్చారు.. ఇందులో 226 కేంద్రాలకు



మాత్రమే కాంపౌండ్ వాల్ ఉన్నట్టు వివరించారు. ఎం.పి కేశినేని శివనాథ్ చేసిన అభ్యర్థులపై కేంద్రమంత్రి అన్నపూర్ణ దేవి సానుకూలంగా స్పందించారు.

# ఎన్టీఆర్ విగ్రహానికి మరమ్మతులు చేపట్టండి

- **అధికారులకు నుడా మాజీ చైర్మన్ శ్రీనివాసులు రెడ్డి ఆదేశం**

నెల్లూరు, మహానాడు:

పట్టణంలోని నెక్లెస్‌రోడ్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి మర మ్మత్తులు చేపట్టాలని అధికారులకు నుడా మాజీ చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. రూరల్ ఎమ్మెల్యే కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డి సూచనల మేరకు అధికారులతో కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి సమావేశమై మాట్లాడారు.


నెల్లూరు నెక్లెస్ రోడ్డును తెలుగుదేశం ప్రభుత్వం అభివృద్ధి చేసిందని.. టిడిపి హయాంలో ఎన్టీఆర్ విగ్రహంతో పాటు.. బుద్ధుడు, పొట్టి శ్రీరాములు విగ్రహాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఆ



విగ్రహాలు మరమ్మతులకు గురయ్యాయని, మర మ్మతులు చేసి, సుందరంగా తయారు చేయాలని ఆదేశించారు. పట్టణాన్ని పర్యాటక కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు పడవల కృష్ణమూర్తి, గడవరపు నాని, మురల్లి, టిడిపి నేతలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రిల్లో
# నిరాటంకంగా రోగులకు సేవలు

- **మంత్రి దామోదర్ రాజనర్సింహ**



హైదరాబాద్, మహానాడు:

ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులలో రోగుల సంరక్షణ సేవలు నిరాటంకంగా సాగుతున్నాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గురువారం తెలిపారు. ఆస్పత్రి పనితీరుకు ఆటంకం కాకుండా పారదర్శకంగా బదిలీలు చేపట్టామన్నారు. ఇంకా ఆయన మాట్లాడూతు... దీర్ఘకాలికంగా ఒకే చోట ఉద్యోగ విధులను నిర్వహిస్తున్న 40% ఉద్యోగుల సర్వీసును గుర్తించి వారిని బదిలీలు చేశాం. ఈ బది లీల వల్ల ఆసుపత్రి పనితీరుకు, రోగుల సంరక్షణ సేవలకు ఏ విధంగా ఆటంకం కలగకుండా బదిలీలనుపారదర్శకంగా చేపట్టాం. జీవో నెంబర్ 80 ప్రకారం సూపర్ స్పెషాలిటీ సేవలలో అత్యవసరతను పరిగణలోకి తీసుకొని ఈ బదిలీల్లో స్పెషాలిటీ డాక్టర్లకు మినహాయింపు ఇచ్చాం.



వైద్యులు, సీనియర్ రెసిడెంట్ డాక్టర్ల ను కాంట్రాక్టు పద్ధతిన మార్చి 2024లో నియమించాం. వీటితోపాటు ఆగస్టు 9వ తేది. 2024న వైద్యులు, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లను కాంట్రాక్టు పద్ధతిన నియమించుకోవడానికి మళ్లీ షెడ్యూలు విడుదల చేశాం. గాంధీ, ఉస్మానియా ఆస్పత్రులలో తగిన సంఖ్యలో వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది ఉండి రోగుల సంరక్షణ సేవలను అందిస్తున్నారు. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులలో అందుబాటులో ఉన్న డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్లు సంఖ్యను గత ఏడాది 2023 ఆగస్టు ఏడోతేదీకి ఈ ఏడాది ఏడో తేదీ వరకు మధ్య తేడా ఈ క్రింది విధంగా ఉంది.

**ఉస్మానియా ఆసుపత్రిలో:**

**07.08.2023వ తేదీన ఉన్న ఉద్యోగులు**

డాక్టర్లు - 169.
జూనియర్ రెసిడెంట్లు - 69.
పోస్ట్ గ్రాడ్యుయేట్లు - 1638.
నర్సింగ్ ఆఫీసర్ లు - 247.
మొత్తం. 2123 .

**07.08.2024వ తేదీన ఉన్న ఉద్యోగులు.**

డాక్టర్లు - 266.
సీనియర్ రెసిడెంట్లు - 218.
పోస్ట్ గ్రాడ్యుయేట్స్ - 1638.
నర్సింగ్ ఆఫీసర్లు - 263.
మొత్తం. 2385.

**గాంధీ ఆసుపత్రిలో:**




**07.08.2023వ తేదీన ఉన్న ఉద్యోగులు**

డాక్టర్లు - 295.
జూనియర్ రెసిడెంట్లు - 51.
పోస్ట్ గ్రాడ్యుయేట్లు - 723.
నర్సింగ్ ఆఫీసర్‌లు - 191
మొత్తం. 1260.

**07.08.2024 వ తేదీన ఉన్న ఉద్యోగులు**

డాక్టర్లు - 362
సీనియర్ రెసిడెంట్లు - 119.
పోస్ట్ గ్రాడ్యుయేట్స్ - 723.
నర్సింగ్ ఆఫీసర్లు - 287.
మొత్తం. 1491.

ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులలో సూపర్ స్పెషాలిటీ, బ్రాడ్ స్పెషాలిటీ సేవలు జీవో. ఆర్టీ.నెం.80 ప్రకారం నిర్వహించిన సాధారణబదిలీలలో ఏ రకమైన ప్రభావానికి గురికాలేదు. రోగుల సంరక్షణ సేవలను నిరాటంకంగా కొనసాగిస్తున్నాం.

## జీవన్మరణ సమస్యగా మారిన
# బచావత్ చూపిన హక్కుల పరిరక్షణ

విజయవాడ, మహానాడు:


ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడుగారికి,
నమస్తే!

ఈ వినతి పత్రమైనా మీకు చేరుతుందని ఆశిస్తున్నా!

బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ లో ఈనెల 28, 29 తేదీలలో విచారణకు రానున్న కృష్ణా నదీ జలాల అంశంపై మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావుతో పాటు రైతు సంఘాల నేతలు అక్కినేని భవానీప్రసాద్, వై. కేశవరావు, కె.వి.వి. ప్రసాద్, బొజ్జా దశరథరామిరెడ్డి, ఆళ్ళ వెంకట గోపాలకృష్ణలతో కూడిన ప్రతినిధి బృందం మీకు వినతిపత్రం అందజేయాలని అపాయింట్మెంట్ కోసం జూలై 30వ తేదీన మీ అపాయింట్మెంట్స్ వ్యవహారాలు చూసే అధికారికి వాట్సాప్ ద్వారా విజ్ఞప్తిచేస్తూ మెసేజ్ పంపాను. ఫోన్ ద్వారా కూడా ప్రయత్నించాను.

కృష్ణా జలాల పంపిణీకి సంబంధించి తెలంగాణ లేవనెత్తిన వివాదంపై ఆంధ్రప్రదేశ్ వైఖరిని తెలియజేయడానికి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన గడువు మరో వారం రోజుల్లో ముగియనున్నది. జలవనరుల శాఖకు సంబంధించిన అంశాలపైన మీరు ఆగస్టు 6న సమీక్ష చేసినట్లు దినపత్రికల్లో చదివాను. ఈ సమస్య ప్రస్తావన వార్తల్లో ఎక్కడా కనపడలేదు.

కృష్ణా జలాలపై బచావత్ ట్రిబ్యునల్ ఆంధ్రప్రదేశ్ కు కల్పించిన హక్కుల పరిరక్షణ జీవన్మరణ సమస్యగా పరిణమించింది. రైతు సంఘాల నాయకుల అభిప్రాయాలను మీ దృష్టికి తీసుకురావాలన్న సదుద్దేశంతో మీ అపా



యింట్మెంట్ కోసం నేను చొరవ తీసుకొని ప్రయత్నించాను. మీతో అపాయింట్మెంట్ నేటి వరకు లభించలేదు. ఈ నేపథ్యంలో క్లిష్టంగా పరిణమించిన కృష్ణా నదీ జలాల సమస్యపై నాకున్న అవగాహనను మీ దృష్టికి తీసుకురావడం ఆంధ్రప్రదేశ్ పౌరుడుగా నా బాధ్యతగా భావించాను. ఈ వినతి పత్రాన్ని ఇ-మెయిల్ మరియు వాట్సాప్ ద్వారా పంపుతున్నాను. ఇది మీకు చేరుతుందని, తప్పక పరిశీలిస్తారని ఆశిస్తున్నాను.


అభివందనములతో

**- టి.లక్ష్మీనారాయణ**
**ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి అధ్యయన వేదిక**

# అవయవదాతలకు సత్కారాలు అభినందనీయం

- **జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరెడ్డి**

గుంటూరు, మహానాడు:



అవయవ దాతలకు సత్కారాలు చేసేందుకు ప్రభుత్వం ముందుకు రావడం ఎంతో అభినందనీయమని జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అన్నారు. బ్రెయిన్ డెత్ సంభవించిన అవయవ దాతలు కిడ్నీ, లివర్, ఊపిరితిత్తులు, గుండె లాంటి అవయవాల మార్పిడితో వేలాది మందికి పునర్జన్మను ఇస్తున్నారన్నారు. దాతలను, వారి కుటుంబసభ్యులను ఘనంగా సత్కరించాలని, అవయవదాతల అంతిమ సంస్కారాన్ని అధికార లాంఛనాలతో నిర్వహించాలని, అవయవ దాతల కుటుంబ సభ్యులకు పదివేల రూపాయలు అందించాలని నిర్ణయించడం స్వాగతిస్తున్నట్లు తెలిపారు.

అవయవ దాత అంతిమ సంస్కారానికి ఆర్డీవో స్థాయిపై అధికారి హాజరు అవ్వాలని, ఆసుపత్రి నుండి శ్మశానం వరకు ఉచిత వాహనాన్ని ఏర్పాటు చేయాలని, కుటుంబ సభ్యులకు యోగ్యత పత్రం, మెమెంటోను అందించాలని ప్రభుత్వ ఉత్త ర్వులో పేర్కొనడం హర్షనీయమన్నారు. జిల్లా కలెక్టర్ అవయవదాత ఫోటోతో వారు అందించిన అవయవాల వివ రాలను పేర్కొంటూ పత్రికా ప్రకటన చేయాలని, అవయవ దాతలకు స్ఫూర్తిని అందించే సందేశాన్ని ప్రచురింప చేయాలని పేర్కొనడం అభినందనీయమన్నారు.

ప్రపంచంలో స్వీడన్, అమెరికా, జపాన్ లాంటి దేశాలలో అవయవ దానాలు అత్యధికంగా జరుగుతుంటే భారతదేశంలో ప్రతి 10 లక్షల మందిలో ఒక్కరే శరీర దానాన్ని చేస్తున్నారని వివరించారు. ప్రభుత్వం ప్రకటించిన సత్కారాలు, గౌరవాలతో మరింత మంది అవయవ-శరీర దానాలకు ముందుకు వస్తారని జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

# కూటమి ప్రభుత్వంలో కష్టపడి పనిచేస్తాం..

- **ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**

వీరులపాడు, మహానాడు:

రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. వీరులపాడు మండలం జయంతి గ్రామంలో ఎస్డీఏ చర్చి సంఘ కాపరి, సంఘస్తులు ఏర్పాటు చేసిన కార్య




క్రమంలో సౌమ్యను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు.

ప్రజలకు సంక్షేమ పాలన అందిం చడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు కష్టపడుతున్నారన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. దగాకోరు వైసీపీకి సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు.

జయంతి గ్రామంలో భారీ మెజారిటీ అందించినందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తాను ఎన్నికల ప్రచార పర్యటనలో వచ్చిన సందర్భంగా ఫీజు రీయింబర్స్ మెంట్ అందలేదని విద్యార్థులు వినతులు అందజేశారని కూటమి ప్రభుత్వంలో వాటి పరిష్కార దిశగా చర్యలు చేపడతామని సూచించారు.

సుమారు ఎనిమిది వందల సభ్యులున్న సెవెంత్ డే అడ్వింటిస్ట్ చర్చి నిర్మాణమునకు నిధులు మంజూరు కొరకు సంఘ కాపరి మరియు సంఘస్తులు విన్నవించగా వెంటనే దాని స్పందిస్తూ సహకారాన్ని అందిస్తానని వారికి హామీ ఇచ్చారు.



గ్రామాలతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం తాను చిత్తశుద్ధితో పనిచేస్తామని స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో గ్రామ, మండల పార్టీ నాయకులు, కూటమి నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### సరితకు ఎమ్మెల్యే రూ.10వేల ప్రోత్సాహకం

జయంతి గ్రామంలో పాము సరిత అనే విద్యార్థికి పదో తరగతిలో 564 మార్కులు సాధించినందుకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేసారు. ఇంకా ఉన్నత చదువులు అభ్యసించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరుతూ, సరితకు ప్రోత్సాహకరంగా తంగిరాల సౌమ్య రూ.10వేలను అందజేశారు.

# విద్యాభివృద్ధితోనే ఉత్తమ సమాజం!

- **డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి**

దర్శి, మహానాడు:

విద్యాభివృద్ధితోనే మన సమాజ అభివృద్ధి సాధ్యం డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. విద్యార్థులు చదువులు పట్ల శ్రద్ధ వహించి భవిష్యత్తు తరాలకు వారధులుగా నిలవాలని కుటుంబాల అభివృద్ధికి తోడ్పడాలని ఆర్థికంగా సామాజికంగా దేశాభివృద్ధిలో విద్యార్థి కీలకపాత్ర పోషించాలని కోరారు. దర్శి నియోజకవర్గం, దొనకొండ మండలం, కొచ్చర్లకోట గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులతో ముచ్చటించారు. వారి బాగోగులు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతగానో తోడ్పాటునిస్తుందని తెలిపారు. విద్యా ఐటీ శాఖ మంత్రివర్యులు గౌరవనీయులు నారా లోకేష్ విద్యార్థులు చక్కటి వాతావరణంలో విద్యను అభ్యసించేందుకు అవసరమైన వస్తువులను సమకూరుస్తున్నారని వివరించారు. విద్య అభివృద్ధికి ప్రభుత్వ సహకారాన్ని అందుకొని మీరంతా చక్కగా చదువుకొని భావితరాల భవిష్యత్తుకు తోడ్పాటు ఇవ్వాలని డాక్టర్ లక్ష్మీ సూచించారు.



జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ శుక్రవారం 09, ఆగస్టు 2024





## రియల్ ఎస్టేట్ రంగ సమస్యల పరిష్కారానికి
# త్వరలో ఉన్నత స్థాయి సమీక్ష

● నెరెడ్కో ప్రతినిధులతో రెవిన్యూ మంత్రి సత్య ప్రసాద్

అమరావతి, మహానాడు:

రియల్ ఎస్టేట్ రంగం ఎదుర్కుంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ అన్నారు. నిర్మాణ రంగంపై లక్షలాది మంది కార్మికులతో పాటు, పలు ఇతర రంగాలు కూడా ఆధార పడి ఉన్నాయన్నారు. నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నెరెడ్కో) ప్రతినిధుల బృందం గురువారం సచివాలయంలో మంత్రిని కలిసి తమ పరిశ్రమ ఎదుర్కొంటున్న విభిన్న సమస్యలను ప్రస్తావించారు.

దాదాపు అరగంటలకు పైగా జరిగిన సమావేశంలో నెరెడ్కో ప్రతినిధులు గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన విభిన్న విధానాల పట్ల తమ అసంతృప్తిని వ్యక్త పరిచారు. అమరావతి ప్రాంతంతో సహా రాష్ట్ర వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగాన్ని ఇక్కట పాలు చేశారని నెరెడ్కో రాష్ట్ర అధ్యక్షుడు గద్దె చక్రధరరావు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. భూసర్వే పేరిట ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన చట్టాలను రద్దు చేయాలని కోరారు. ఎల్ పిఎం నెంబర్ విధానం వల్ల ఎటువంటి ఉపయోగం లేదని, దీని వల్ల కొత్త సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని వివరించారు.


నాలా (నాన్ అగ్రికల్చరల్ ల్యాండ్ అసెస్మెంట్) పన్నును గణనీయంగా పెంచుతూ పోతున్నారని దానిని హేతుబద్ధం చేయాలని సెంట్రల్ జోన్ అధ్యక్షుడు సందీప్ మండవ కోరారు. ఉమ్మడి అభివృద్ధి ఒప్పందం (జెడిఎ) కోసం రిజిస్ట్రేషన్ ఛార్జీలు మినహాయింపుతో డెవలపర్లపై ఆర్థిక భారాన్ని తగ్గించాలని విన్నవించారు. కనీసం ఒక సంవత్సరం పాటు రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచకుండా చూడాలని రాష్ట్ర కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు కిరణ్ పరుచూరి కోరారు. జాయింట్ డెవలప్మెంట్ ప్రాజెక్టలను ప్రోత్సహించేలా నిబంధనలు సరళీకరించాలన్నారు. వ్యవసాయ భూమిని గృహ వినియోగ అవసరాలకు మార్చే సమయంలో భూమి లెక్కింపును ఎకరాలలో తీసుకోవాలని నెరెడ్కో ప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా మంత్రి అనగాని మాట్లాడుతూ ముఖ్యమంత్రి రియల్ ఎస్టేట్ సమస్యల పరిష్కారం పట్ల సానుకూలంగానే ఉన్నారని, రానున్న రోజుల్లో అన్ని విభాల సమన్వయంతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.



## భారత హాకీ జట్టుకు మంత్రి అనగాని అభినందనలు

అమరావతి, మహానాడు:



పారిస్ ఒలింపిక్స్ లో కాంస్య పతకం సాధించిన భారత హాకీ జట్టును రాష్ట్ర రెవిన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ అభినందించారు. 52 ఏళ్ల తర్వాత వరుసగా రెండు ఒలింపిక్స్‌లో భారత జట్టు కాంస్య పతకం సాధించడం దేశానికి గర్వకారణమన్నారు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లోనూ భారత్ హాకీ జట్టు కాంస్య పతకం సాధించిందని గుర్తు చేశారు. ఈ పతకం భారత జాతీయ క్రీడ అయిన హాకీకి పునర్వైభవం తీసుకువస్తుందన్నారు.

కెప్టెన్ హర్మన్ ప్రీత్, కీపర్ శ్రీజేష్ పతకసాధనలో కీలక పాత్ర పోషించినందుకు అభినందనలు తెలిపారు.

హాకీ జట్టు ఇచ్చిన స్ఫూర్తితో భారత క్రీడాకారులు మరిన్ని పతకాలు గెలవాలని మంత్రి అనగాని ఆకాంక్షించారు.




## 'కూటమి' హయాంలో
# దర్శి రూపురేఖలు మారుస్తా...

● టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, మహానాడు:

కూటమి ప్రభుత్వ హయాంలో దర్శి రూపురేఖలు మారుస్తానని టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. దర్శి నగర పంచాయతీ 12వ వార్డులో సిమెంటు రోడ్డు నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేసిన అనంతరం మాట్లాడారు. దర్శి అభివృద్ధి బాధ్యత నేను తీసుకున్నాను. ఇప్పటికే నేను ప్రణాళికబద్ధంగా ముందుకు వెళుతున్నానని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ 50 రోజుల ప్రజా ప్రభుత్వ పాలనలో అనేక అద్భుతాలు ఆచరణలో చూపించగలిగారన్నారు. ప్రభుత్వం అంటే సేవ అని నిరూపించగలిగారని పేర్కొన్నారు. జిల్లా మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్, జిల్లా అధికార యంత్రాంగం, స్థానిక అధికారుల సహకారంతో ఈ ఐదేళ్ల కాలంలో దర్శి అభివృద్ధి చేయాలన్నదే నా లక్ష్యమని చెప్పారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమని విమర్శించారు. ప్రజలు నేరుగా నా దగ్గరకు వచ్చి మీ సమస్యలు తెలియజేయవచ్చు. దర్శిని సుందరంగా తీర్చిదిద్దేందుకు రోడ్లు, డ్రైన్లు, మంచినీరు, పార్కుల సుందరీ కరణ, విద్య, వైద్యం కోసం మన కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. దర్శి ప్రాంతంలో వలసలు నివారించేందుకు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాస్ రెడ్డి సహకారంతో కేంద్ర నిధులతో పారిశ్రామిక అభివృద్ధి కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. అదేవిధంగా ప్రతి ఇంటికి మంచినీరు ఇచ్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ద్వారా దర్శి ప్రజలకు మేలు జరుగుతుందని ఆమె వివరించారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యుడు నారపుశెట్టి పాపారావు, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, మున్సిపల్ కమిషనర్ మహేష్, మున్సిపల్ సిబ్బంది, తదితర నేతలు ఉన్నారు.

# గంజాయి ముఠా గుట్టు రట్టు!

● ఏడుగురి నిందితుల అరెస్టు
● ఎస్పీ సతీష్ కుమార్

తెనాలి, మహానాడు:

చోరీ కేసులో నిందితులను పట్టుకునేందుకు వెళ్లిన పోలీసులకు గంజాయి విక్రయించే ముఠా సభ్యులు దొరికిన ఘటన గుంటూరు జిల్లా, తెనాలి మండలంలో చోటుచేసుకుంది. పలు పోలీస్ స్టేషన్లలో చోరీకి పాల్పడిన కేసుల్లో నిందితులుగా ఉన్న పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తుండగా గంజాయి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. తెనాలి డిఎస్పీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ సతీష్ కుమార్ ఏడుగురు నిందితులను మీడియా ముందు హాజరుపరిచి, మాట్లాడారు. తెనాలి మండలం సంగం జాగర్ల మూడి గ్రామంలోని డంపింగ్ యార్డ్ వద్ద గంజాయిను చిన్న పొట్లాలుగా చేసి విక్రయించేందుకు సిద్ధం చేస్తున్న ఏడుగురు నిందితులను రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. వారి వద్ద నుండి 21 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, నిందితుల్లో అమ్మిశెట్టి శివచందు, సిద్ధార్థ, పవన్, సాయి పలు పోలీస్ స్టేషన్ల వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్నట్టు పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల నుండి గంజాయి తెచ్చి ఏడుగురు సభ్యుల ముఠా యువత ప్రధానంగా చేసుకొని గంజాయి విక్రయిస్తున్నారన్నారు. నిందితుల్లో ప్రధానమైన అమ్మిశెట్టి శివ చందుపై గతంలోనే 10 కేసులు ఉన్నాయన్నారు. శివ చందు, సిద్ధార్థ, పవన్ సాయి పది బైకులు, 13 గ్రాములు బంగారం వస్తువులను దొంగిలించిన కేసుల్లో నిందితులని తెలిపారు.



సమావేశంలో అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వరరావు,తెనాలి డిఎస్పి బి.జనార్ధన్‌రావు, సీఐ టి.వెంకటేశ్వర్లు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# హైదరాబాద్ నగరం పెట్టుబడులకు తలమానికం

- మీడియాతో డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, మహానాడు:

హైదరాబాద్ నగరం పెట్టుబడులకు తలమానికమని, ఉద్యోగాలు రావాలని, జీవనస్థితిగతులు మారాలని కోరి తెచ్చుకున్న రాష్ట్రం మనదని డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం జిహెచ్ఎంసి పరిధిలోని విద్యుత్ శాఖ అధికారులు సిబ్బందితో సమీక్ష, అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

హైదరాబాద్ నగరంలో వినియోగదారులందరికీ కరెంటు నిరంతరం నాణ్యతతో జరగాలని సమీక్ష సమావేశంలో స్పష్టం చేసినట్టు తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో గాలులు, వారాల మూలంగా, వైర్లు వంగిపోయి ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున అన్ని ప్రాంతాల్లో సిబ్బందిని అప్రమత్తం చేసేందుకు సమీక్ష సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారుల సేవల కోసం ఏర్పాటు చేసిన 1912 హెల్ప్ లైన్ కు విస్తృత ప్రచారం కల్పించనున్నట్లు తెలిపారు. 108 తరహాలో విద్యుత్ సంస్థ హెల్ప్ లైన్ సేవలను విస్తృతం చేస్తామన్నారు. గాలి పీల్చుకోవడం ఒక నిమిషం ఆగిపోతే ఎంత ప్రమాదమో విద్యుత్తు స్తంభిస్తే అంతే ప్రమాదంగా ప్రజలు భావిస్తున్నారని.. మారిన కాలానికి అనుగుణంగా విద్యుత్ సిబ్బంది సేవలు పెరగాలని డిప్యూటీ సీఎం తెలిపారు. సిబ్బంది బాగా పనిచేసే ప్రచారం కల్పించుకోవాలి ఇందుకు సోషల్ మీడియాను విస్తృతంగా వినియోగించుకోవాలి ప్రజల మనసులు తెలుసుకోవాలని డిప్యూటీ సీఎం అధికారులను కోరారు.

విద్యుత్ శాఖ సేవా దృక్పథంతో పనిచేస్తుంది.. సమాజానికి వెలుగులు ఇచ్చే శాఖలో పని చేస్తున్నామనే భావన ఉద్యోగుల్లో ఉండాలి.. ఆ భావన కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. సిబ్బంది కష్టపడేది వినియోగదారులకు తెలియజేసేందుకు ఒక కార్యాచరణ సిద్ధం చేస్తామన్నారు. మాకు బేషజాలు లేవు ఎంత చిన్నవారు సమస్యలు చెప్పిన వినడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. పదోన్నతులు బదిలీలకు సంబంధించిన కార్యాచరణ వెంటనే చేపట్టాలని ఉన్నదా అధికారులను ఆదేశించారు. ట్రాన్స్ఫార్మర్లు, విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేసే క్రమంలో స్థలం సమస్య వస్తోంది.

ఈ నేపథ్యంలో ఇంటి నిర్మాణానికి అనుమతి ఇచ్చే సమయంలోనే విద్యుత్ శాఖకు అవసరమైన స్థలాన్ని కేటాయించేలా



చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు లేఖ రాస్తానని డిప్యూటీ సీఎం తెలిపారు. విద్యుత్ సంస్థ హెల్ప్ లైన్ 1912కు ఫిర్యాదు రాగానే అధికారులు స్పందించి ఫిర్యాదు దారుకు ఫోన్ చేసి ఇబ్బందిని తొలగిస్తామని సమాచారం ఇస్తే వారికి విద్యుత్ శాఖ పై నమ్మకం ఏర్పడుతుందని తెలిపారు. ఫిర్యాదులను వెంటనే పరిష్కరించండి. స్థానిక ప్రజాప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదులను పాజిటివ్‌గా తీసుకొని పరిష్కరించాలి వారు కొన్ని వేలు, లక్షల మందికి ప్రతినిధులు అన్న విషయాన్ని గమనంలో పెట్టుకోవాలని తెలిపారు.

అమెరికాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబులు పెట్టుబడిదారులతో మాట్లాడుతున్నారు. వారు నాణ్యమైన విద్యుత్తు, లా అండ్ ఆర్డర్, మంచినీటి వసతి అడుగుతున్నారు. హైదరాబాద్‌కు వెళ్తే ఎలాంటి ఇబ్బంది ఉండదు, జీవితం హాయిగా ఉంటుందన్న భావన ఏర్పడాలన్నారు. నాణ్యమైన విద్యుత్తు నిరంతరాయం అందిస్తే పరిశ్రమలు ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది, జిడిపి పెరుగుతుంది అన్నారు. ఉద్యోగాలు రావాలని, జీవనస్థితిగతులు మారాలని, ప్రపంచంతో పోటీ పడాలని బాధ, ఆవేదనతో కోరి తెచ్చుకున్న రాష్ట్రం తెలంగాణ అన్న విషయాన్ని విద్యుత్ సిబ్బంది గమనంలో పెట్టుకొని నాణ్యమైన సేవలు అందించాలన్నారు.

నిలువునా విరిగిపడిన సుంకిశాల గోడ అంటూ, కడుతున్న ప్రాజెక్టులో పెద్ద ప్రమాదం జరిగిందనేలా ఓ పత్రికలో వండి వార్చారని డిప్యూటీ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్గొండ జిల్లాలో నాగార్జునసాగర్ బ్యాక్ వాటర్ లో నిర్మించిన సుంకిశాల ప్రాజెక్టును 11 జూలై 2021న గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించి జూలై 2023 న టన్నెల్ సైడ్ వాల్ పూర్తి చేశారని వివరించారు. అంటే వారు నిర్మించిన



కాళేశ్వరం మేడిగడ్డ సుందిళ్ల మాత్రమే నాసిరకం అని అనుకున్నాం మిగిలినవి బాగా ఉన్నాయని నిన్నటి వరకు అనుకున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు.

వాళ్లు గోదావరి కాదు కృష్ణ నదిని కూడా వదిలిపెట్టలేదని సుంకిశాల గోడ కూలడంతో తేటతెల్లమైందని డిప్యూటీ సీఎం ఆరోపించారు. మీ హయాంలో డిజైన్ల లోపంతో నిర్మించిన సుంకిశాల గోడలు కూలిపోతే ఉన్నది లేనట్టు లేనిది ఉన్నట్టు.. కాంగ్రెస్ రాగానే కూలిందని గత పాలకులు పత్రిక, టీవీ ఛానల్ లో సుంకిశాల పాపం వేరొకరిని సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు సంపాదించిన అక్రమ సంపాదన ఉందని సోషల్ మీడియాలో ఎవరిదో ఈ పాపం ఉన్నట్టు ప్రచారం చేస్తున్నారు.. తెలంగాణ ప్రజలు ఇప్పటికే గట్టిగా బుద్ధి చెప్పారు మరోసారి లేవకుండా చేస్తారని డిప్యూటీ సీఎం అన్నారు. సుంకిశాల సైడ్ వాల్ కూలిన ఘటనపై అధికారులు విచారణ చేస్తున్నారని, దోషులు ఎవరో తేలుస్తామని డిప్యూటీ సీఎం అన్నారు.

## హైదరాబాదులో పరిశ్రమలు స్థాపించండి..సంపూర్ణ సహకారం అందిస్తాం

- బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గ్యారెట్ విన్ ఓవెన్‌తో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

హైదరాబాద్, మహానాడు:

సకల వసతులు ఉన్న హైదరాబాదులో పరిశ్రమలు స్థాపించండి ప్రభుత్వ పక్షాన సంపూర్ణ సహకారం అందిస్తామని బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గ్యారెట్ విన్ ఓవెన్ ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు కోరారు. గురువారం ఉదయం ప్రజాభవన్లో డిప్యూటీ సీఎంతో బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గ్యా రెట్, బ్రిటిష్ హై కమిషన్ పొలిటికల్ ఎకానమీ అడ్వైజర్ నలిని రఘురామన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరువురు మధ్య మౌలిక సదుపాయాలు, గ్రీన్ ఎనర్జీ, అర్బన్ డెవలప్మెంట్, స్కిల్ డెవలప్మెంట్ వంటి అంశాలు చర్చించారు.

డిప్యూటీ సీఎం మాట్లాడుతూ పరిశ్రమలు స్థాపించడానికి హైదరాబాద్ స్వర్గధామం లాంటిది అని వివరించారు. అందరికీ అనుకూలమైన వాతావరణం, తక్కువ ధరలో మానవ వనరులు, నిరంతరాయం నాణ్యమైన విద్యుత్ సరఫరా, తాగునీటి కొరతలేని పరిస్థితి వంటి సదుపాయాలను వివరించారు. వీటికి తోడు రీజనల్ రింగ్ రోడ్డు, మూసి పరివాహక ప్రాంత అభివృద్ధికి జరుగుతున్న కార్యాచరణను వివరించారు.



6

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 09, ఆగస్టు 2024

# జగన్ కేవలం పులివెందుల ఎమ్మెల్యే మాత్రమే!

● గుంటూరు నగర అధ్యక్షుడు దేగల ప్రభాకర్


**గుంటూరు, మహానాడు:**

జగన్ మానసిక స్థితి బాగోలేదని ఆయన చెల్లెలు చెప్పింది నిజమే అన్నట్టుగా జగన్ వ్యహరిస్తున్నారని తెలుగుదేశంపార్టీ గుంటూరు నగర అధ్యక్షుడు దేగల ప్రభాకర్ ఆరోపించారు. అర్బన్ పార్టీ కార్యాలయం లో గురువారం ప్రభాకర్ విలేకర్లతో మాట్లాడరు. జగన్ పులివెందుల ఎమ్మెల్యే మాత్రమేనని, ప్రతిపక్ష నేత కాదని పేర్కొన్నారు. వైసీపీకి కేవలం 11 స్థానాలే వచ్చినా, తాము గౌరవిస్తున్నామన్నారు. అసెంబ్లీలో అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబును జగన్ హేళన చేశారన్నారు.

23 మంది టీడీపీ ఎమ్మెల్యేలలో కొంత మందిని లాగేస్తే ప్రతిపక్ష నేత హోదా పోతుందని జగన్ అనలేదా? అని ప్రశ్నించారు. జగన్ రెడ్డి విలువలు, విశ్వసనీయత గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని అన్నారు. ఇచ్చిన హామీల్లో కేవలం 13 శాతం మాత్రమే అమలు చేసి ప్రజలకు పంగనామాలు పెట్టిన జగన్‌కు, ఇచ్చిన మాట ప్రకారం హామీల అమలు చేస్తున్న చంద్రబాబును విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. జగన్‌ను రాష్ట్ర ప్రజలు మాత్రమే కాదు, ఆయన పార్టీ నేతలు కూడా వద్దనుకుంటున్నారన్నారు. ఓటమి నుంచి జగన్ రెడ్డి పాఠాలు నేర్చుకోవడం లేదన్నారు. జగన్ రెడ్డి తాను మళ్లీ సీఎం కుర్చీపైన కూర్చుంటానంటూ పగటి కలలు కంటున్నారన్నారు. వైసీపీ మునుగుతున్న నావ అని, ఇప్పుడు పూర్తిగా మునిగిపోయిందని పేర్కొన్నారు.




# పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం
# బుద్ధదేవ్ భట్టాచార్య కన్నుమూత



**కోల్‌కతా, మహానాడు:**

ప్రముఖ లెఫ్ట్ నేత, సీనియం సీపీఎం నాయకుడు, పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం బుద్ధదేవ్ భట్టాచార్య (80) గురువారం కన్నుమూశారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. చూపు మందగించడంతో పాటు ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నారు. అందుకే కొన్నాళ్లుగా రాజకీయాలకు దూరంగానే ఉంటున్నారు. గతేడాది అతనికి న్యుమోనియా సోకడంతో లైఫ్ సపోర్టు పెట్టాల్సి వచ్చింది. అనారోగ్య కారణాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన 80 ఏళ్ల వయసులో బుధవారం ఉదయం కోల్‌కతాలోని స్వగృహంలో కన్నుమూశారు. బుద్ధదేవ్ భట్టాచార్య మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయనకు భార్య మీరా, కుమారుడు సుచేతన్ ఉన్నారు.

కాగా, 1944 మార్చి ఒకటోతేదీన కోల్‌కతాలో జన్మించిన బుద్ధదేవ్ భట్టాచార్య 2000 నుంచి 2011 వరకు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. బెంగాల్ ఏడో ముఖ్య మంత్రిగా 11 ఏళ్లపాటు బాధ్యతలు నిర్వర్తించారు.


50 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో ఆటుపోట్లను చూశారు. పార్టీకోసం చాలా కీలకంగా పనిచేశారు. 1972 నుంచి రాజకీయాల్లో ఒక్కో మెట్టూ ఎక్కుతూ బెంగాల్‌లో కమ్యూనిస్టుల మార్క్‌ను కొన సాగించారు. బుద్ధదేవ్ భట్టాచార్య జ్యోతిబసు తర్వాత అత్యున్నత పదవిలో అధికాలం కొనసాగారు.

# కేరళ సీఎం చేతికి చెక్కులు

**హైదరాబాద్, మహానాడు**

కేరళలోని వాయనాడ్ విపత్తుపై స్పందించి మెగా స్టార్ చిరంజీవి, ఆయన తనయుడు రామ్‌చరణ్‌లు కోటి రూపాయల సాయం ప్రకటించారు. ఆపదలో ఉన్న వాళ్ళను ఆదుకోవటానికి ముందుకు రావటం మంచి పరిణామమే. అయితే చిరంజీవి తాను ప్రకటించిన కోటి రూపాయల సాయం అందించటానికి స్పెషల్ ఫ్లైట్‌లో త్రివేంద్రం వెళ్లారు. ఈ స్పెషల్ ఫ్లైట్ ఖర్చు అంతా ఆయనే భరించుకుంటారు...ఇందులో ఎవరికీ ఎలాంటి అభ్యంతరం ఉండాల్సిన అవసరం లేదు. అయితే ఇక్కడ చర్చ అంతా కోటి రూపాయల సాయం అందించటం కోసం ఏకంగా చిరంజీవి ప్రత్యేక విమానం వేసుకుని మరీ కేరళ వెళ్లారు అంటే చేసే సాయం కంటే ప్రచారమే ఎక్కువ కోరుకుంటున్నట్లు ఉంది అనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కేరళ వెళ్లిన చిరంజీవి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ ను కలిసి చెక్కులు అందించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితి గురించి సీఎంని అడిగి తెలుసుకున్నారు. చిరంజీవి, రామ్ చరణ్‌లు కోటి రూపాయల సాయం అందిస్తే...అల్లు అర్జున్ 25 లక్షల రూపాయలు, హీరోయిన్ రష్మిక పది లక్షలు, ప్రభాస్ రెండు కోట్ల రూపాయలు కేరళ సీఎం సహాయనిధికి విరాళంగా ప్రకటించిన విషయం తెలిసిందే.





# ఎంపెడా సభ్యుడిగా ఎంపీ బాలశౌరి

**మచిలీపట్నం, మహానాడు:** సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధి ప్రాధికార సంస్థ(ఎంపెడా) సభ్యుడిగా మచిలీపట్నం ఎంపీ బాలశౌరి ఎన్నికయ్యారు. ఈ పదవికి తొలుత ఐదుగురు పోటీపడగా ముగ్గురు వైదొలగడంతో కేరళకు చెందిన ఎంపీ హిబీ ఇడెన్(ఐఎన్‌సీ), బాలశౌరి బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా, కేంద్ర వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో పనిచేసే ఎంపెడా విభాగానికి సభ్యుడిగా ఎన్నికైన బాలశౌరికి పలువురు అభినందనలు తెలిపారు.

# స్వాతంత్ర్య దినోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు

● నగర కమిషనర్ హరికృష్ణ

**గుంటూరు, మహానాడు:**

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా జరపడానికి తగిన చర్యలు తీసుకోవాలని, జిల్లా వేడుకల్లో ప్రదర్శించే శకటం నగరపాలక సంస్థలో జరుగుతున్న అభివృద్ధి పనులకు అద్దం పట్టేలా ఉండాలని నగర కమిషనర్ (ఎఫ్ఏసి) ఎస్.హరికృష్ణ అధికారులను ఆదేశించారు. ఎన్టీఆర్ అన్న క్యాంటీన్ల కాన్సెప్ట్ ఉండాలని ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహణపై గురువారం అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. జీఎంసి ప్రధాన కార్యాలయం, ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రధానంగా జిల్లా స్థాయి వేడుకల్లో గుంటూరు నగరపాలక సంస్థ తరుపున ప్రదర్శించే శకటం నగరంలోని అభివృద్ధి పనులకు అద్దం పట్టేలా ఉండాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా పునఃప్రారంభం చేయనున్న ఎన్టీఆర్ అన్నా క్యాంటిన్ కాన్సెప్ట్ తో శకటం సిద్ధం చేయాలన్నారు. ఇప్పటికే నగరంలో 7 ప్రాంతాల్లో అన్నా క్యాంటీన్లను ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. వేడుకల నిర్వహణ ఏర్పాట్లకు సంబంధించి విభాగాల వారీగా అధికారులకు విధులు కేటాయిస్తామని, అందుకు తగిన విధంగా వేడుకల విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.



# తెలంగాణకు పెట్టుబడులు నిజమే..

● ఐటి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్

**హైదరాబాద్, మహానాడు:**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనలో భాగంగా తెలంగాణకు వచ్చిన పెట్టుబడులన్నీ బోగస్ అంటూ ప్రచారం జరగడాన్ని ఐటి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ తీవ్రంగా ఖండించారు.

మొన్న, నిన్న చేసిన కొన్ని పెట్టుబడుల ప్రకటనలు బోగస్ అని వార్తలు వెల్లువెత్తిన నేపథ్యంలో జయేశ్ రంజన్ వీడియో ద్వారా వివరణ ఇచ్చారు.. తెలంగాణకు పెట్టుబడులన్నీ వాస్తవమే అని స్పష్టం చేశారు.

పెట్టుబడుల కోసం అమెరికాలో సీఎం రేవంత్ రెడ్డి బిజీగా ఉన్నారని తెలిపారు. ముఖ్యమంత్రి అమెరికాలో చేస్తున్న మీటింగుల విశ్వసనీయత మీద తెలంగాణ ప్రజలకు ఎటువంటి అనుమానాలు అవసరం లేదని తెలిపారు. అన్ని విషయాలు చెక్ చేసిన తర్వాతే మీటింగ్‌లు చేస్తున్నామని జయేష్ రంజన్ వీడియోలో స్పష్టం చేశారు.



**హైదరాబాద్‌కు చార్లెస్ స్వాబ్..**

ఫైనాన్షియల్ సర్వీస్ లలో ప్రపంచంలో పేరొందిన చార్లెస్ స్వాబ్ కంపెనీ హైదరాబాద్‌లో తమ సంస్థను నెలకొల్పేందుకు సిద్ధమైంది. అమెరికా పర్యటనలో భాగంగా డల్లాస్‌లో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుతో ఈ కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు డెన్నిస్ హెూవార్డ్, రామ బొక్కా సారథ్యంలో ప్రతినిధులు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా టెక్నాలజీ అండ్ డెవెలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుపై కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. హైదరాబాద్‌లో ఈ కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. కంపెనీ కార్యకలాపాలను వేగవంతం చేసేందుకు అవసరమైన మార్గదర్శనం చేస్తామని చెప్పారు. తమ కంపెనీ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతుకు కంపెనీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు ఛార్లెస్ స్వాబ్ తుది అనుమతుల కోసం వేచి చూస్తోంది. త్వరలోనే తమ ప్రతినిధి బృందాన్ని హైదరాబాద్‌కు పంపించనున్నట్లు తెలిపింది. ఈ కంపెనీ విస్తరణతో ఆర్థిక సేవల రంగం లోనూ హైదరాబాద్ ప్రపంచం దృష్టిని ఆకర్షించనుంది.

మరోవైపు, ఈ రోజు అమెరికా పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్.. ఆపిల్ సంస్థ హెడ్ క్వార్టర్ ఆపిల్ పార్క్ వెళ్లనున్నారు. ఆపిల్ మ్యానిఫాక్చర్ టీమ్‌తో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట రెడ్డి భేటీ కానున్నారు. ట్రినేట్ కంపెనీ సీఈఓతో చర్చించనున్నారు. ఆరమ్ గ్రూప్ ఆఫ్ కంపెనీతో భేటీ అయి హైదారాబాద్‌లో ఆ కంపెనీ డేటా సెంటర్స్ విస్తరణ కోసం చర్చలు నిర్వహించనున్నారు. పలువురు టెక్ కంపెనీల ప్రతినిధులతో లంచ్ మీటింగ్‌లో పాల్గొన నున్నారు. అంగెన్ సంస్థ సీనియర్ లీడర్ షిప్‌తో పెట్టుబడులపై చర్చలు నిర్వహించ నున్నారు.

ఎలక్ట్రానిక్ పరికరాల సంస్థ రెనేశాస్ తో, మ్యానిఫాక్చర్ సంస్థ అమాట్‌తో ఇన్వెస్ట్‌మెంట్‌పై చర్చలు నిర్వహించనున్నారు. పలు బిజినెస్ సంస్థలతో రౌండ్ టేబుల్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. అలాగే నిన్న (బుధవారం) ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడితో చర్చలు సఫలం కానున్నాయి. ఫోర్త్ సిటీ, మూసీ సుందరీకరణ, స్కిల్ యూనివర్సిటీ, ప్రజారోగ్య రంగాల్లో సహకారం అందించడానికి ప్రపంచ బ్యాంకు అంగీకరించింది. నిపుణులతో ఉన్నత స్థాయి కమిటీకి నిర్ణయం తీసుకుంది.

హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీలో 400 కోట్లు పెట్టుబడితో ఇన్జెక్టబుల్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వెయ్యి మందికి ఉద్యోగాలు కల్పించేలా వివింట్ సంస్థ కృషి చేస్తామని తెలిపింది. లైఫ్ సైన్సెస్ రంగంలో ఇన్నోవేషన్ డెవలప్మెంట్ కోసం కార్నింగ్ కంపెనీ సహకరిస్తామని తెలిపింది. అంకాలజీ, క్రిటికల్ కేర్ విభాగంలో సహకారం కోసం కార్నింగ్ కంపెనీతో తెలంగాణ సర్కార్ ఎంఓయూ కుదుర్చుకుంది.

## సీఎం రేవంత్ రెడ్డి బృందం అమెరికా పర్యటన...
## కుదిరిన ఒప్పందాలు

**హైదరాబాద్, మహానాడు:**

- **కాగ్నిజెంట్:** అమెరికా తర్వాత హైదరాబాద్‌లో అతి పెద్ద క్యాంపస్. దాదాపు 15,000 ఉద్యోగాలు.
- **వాల్ష్ కార్రా హెూల్డింగ్స్:** డబ్ల్యుఇ-హబ్‌లో 5 మిలియన్ డాలర్ల పెట్టుబడులు. అభివృద్ధి చెందుతున్న తెలంగాణ స్టార్టప్‌లలో 100 మిలియన్ల పెట్టుబడి.
- **ఆర్సీసియం:** దాదాపు 500 హై-ఎండ్ టెక్ ఉద్యోగాలు.
- **స్వచ్ఛ్ బయో:** రూ.1000 కోట్ల పెట్టుబడులు. 500 మందికి ఉద్యోగాలు.
- **ట్రైజిన్ టెక్నాలజీస్:** హైదరాబాద్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్నోవేషన్ డెవెలప్మెంట్, డెలివరీ సెంటర్. దాదాపు 1000 ఉద్యోగాలు.
- **హెచ్‌సీఏ హెల్త్ కేర్:** నాలుగు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో క్యాంపస్ విస్తరణ.
- **కార్నింగ్:** గ్లాస్ ట్యూబింగ్ ఫెసిలిటీ కేంద్రంలో వచ్చే ఏడాదిలో (2025) వాణిజ్య ఉత్పత్తి ప్రారంభం.
- **వరల్డ్ బ్యాంక్:** తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం, సహకారం.
- **వివింట్ ఫార్మా:** రూ.400 కోట్ల పెట్టుబడి, దాదాపు 1000 మందికి ఉద్యోగాలు.
- **చార్లెస్ స్వాబ్:** హైదరాబాద్‌లో భారతదేశంలోనే మొదటి టెక్నాలజీ డెవెలప్మెంట్ సెంటర్.

# కేంద్ర మంత్రి దృష్టికి ఏపీ సమస్యలు

● పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

**ఢిల్లీ, మహానాడు:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం నాడు ఢిల్లీ పర్యటించారు. ఆ వివరాలివి. కేంద్ర కన్స్యూమర్ అఫైర్స్, ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీని కలిశారు. ఈ కింది అంశాలపై చర్చించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కందిపప్పు కేటాయింపులు చేయాలని, ఏపీ రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ఎన్ఎఫ్ఎస్ఏ కవరేజీ కాకుండా లబ్దిదారుల కవరేజీని మరింత పెంచాల్సిందిగా, రాష్ట్రంలో మరో 8 ప్రెస్ రిపోర్టింగ్ కేంద్రాలను పెంచేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. అలాగే, రాష్ట్రంలో ధరల స్థిరీకరణకు రూ.532 కోట్ల ధరల స్థిరీకరణ నిధులను కేటాయించాల్సిందిగా, రాష్ట్రానికి రావాల్సిన రూ.1187 కోట్ల పెండింగ్ నిధులను వీలైనంత త్వరగా విడుదల చేయాలని, రాష్ట్రంలో 11 సిలో గోడౌన్ల నిర్మాణానికి అనుమతి మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ అంశాలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. వీలైనంత త్వరగా పైన పేర్కొన్న అంశాలపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. పార్లమెంట్ సమావేశాలు ముగిసిన తర్వాత ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి ఈ అంశాలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి వెల్లడించారు. మనోహర్‌తో కాకినాడ, ఏలూరు ఎంపీలు, ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్, రాష్ట్ర కన్స్యూమర్ అఫైర్స్, ఫుడ్ అండ్ సివిల్ సప్లైస్ శాఖ సెక్రటరీ, జాయింట్ సెక్రటరీలు పాల్గొన్నారు.




# రుషికొండపై భవనాలకు
# రూ.420 కోట్ల దుర్వినియోగం


**హైకోర్టులో వ్యాజ్యం.. విచారణ 21కి వాయిదా**

**అమరావతి, మహానాడు:**

పర్యావరణ అనుమతులు లేకుండా రుషికొండపై భవనాలు నిర్మించారంటూ జూన్ 23న ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా బాధ్యులపై కేసు నమోదు చేసేలా మంగళగిరి గ్రామీణ పోలీసులను ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో వ్యాజ్యం దాఖలైంది. అప్పటి ముఖ్యమంత్రి జగన్, అప్పటి సీఎస్ జవహర్ రెడ్డి, మరికొందరు అధికార దుర్వినియోగానికి పాల్పడి రూ.420 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశా రంటూ సమాచార హక్కు సంఘం జాతీయ అధ్యక్షుడు టి.గంగాధర్ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు.




జగన్మోహన్రెడ్డి, అప్పటి సీఎస్ జవహర్రెడ్డి, అప్పటి మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రోజా, జోగి రమేష్, బుగ్గన రాజేంద్రనాథెడ్డి, అంబటి రాంబాబు, ఇతర మంత్రులు, అధికారులు నేరపూరిత విశ్వాస ఘాతుకానికి పాల్పడ్డారని పేర్కొన్నారు. వీరిపై కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు చర్యలు లేవని వివరించారు. కేసు నమోదు చేయాలని గుంటూరు ఎస్పీకి సైతం విన్నపమిచ్చామన్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని కేసు నమోదు చేసేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి ముందుకు బుధవారం ఈ వ్యాజ్యం విచారణకు వచ్చింది. తదుపరి విచారణ ఈనెల 21కి వాయిదా పడింది.



జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 09, ఆగస్టు 2024

# మహిళపై మరో మహిళ కత్తితో దాడి!



**నెల్లూరు, మహానాడు:** నెల్లూరు జిల్లా ఆత్మకూరు పట్టణంలో అపార్ట్మెంట్లో ఇద్దరు మహిళల మధ్య వివాదం హత్యాయత్నానికి దారి తీసింది. పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదురుగా ఉన్న ఏరియాలో అపార్ట్మెంట్లో నివాసం ఉంటున్న గాయత్రి అనే మహిళపై అదే అపార్ట్మెంట్లో ఉంటున్న రాజేశ్వరి అనే మహిళ కళ్ళల్లో కారం కొట్టి కత్తితో దాడి చేసింది. ఈ దాడిలో గాయత్రికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు హుటాహుటిన ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. దాడి అనంతరం రాజేశ్వరి నిద్రమాత్రలు మింగి తాను కూడా ఆత్మహత్యాయత్నా నికి పాల్పడింది. దీంతో ఆమెను కూడా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపడుతున్నారు. దాడికి గల కారణం వివాహేతర సంబంధం అని తమ ప్రాథమిక విచారణలో తెలిసినట్టుగా పోలీసులు వెల్లడించారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు తెలుపుతామని వారు చెబుతున్నారు.

## రోడ్డు ప్రమాదంలోఎస్ఐకి తీవ్ర గాయాలు



**కర్నూలు, మహానాడు:** ఎమ్మిగనూరు మండలం, కందనాతి మాచమానదొడ్డి గ్రామం మలుపు దగ్గర గురువారం ఉదయం 9 గంటల సమయంలో బైకు, ఆటో ఢీకొన్న సంఘటనలో ఎస్ఐకి ఒక కాలు విరిగి పోయింది. రూరల్ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న ఎస్ఐ బాల నాయక్ స్కూల్ విద్యా కమిటీ ఎన్నికల విధులకు వెళుతుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది.

నాయక్‌ను చికిత్స కోసం హుటాహుటిన కర్నూలు మెడికల్ కళాశాలకు తరలించారు.

## 100 అడుగుల జెండాతో కావలికి ప్రత్యేక గుర్తింపు

● ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి

**కావలి, మహానాడు:** వంద అడుగుల జాతీయ జెండాతో, మహనీయుల చిత్రపటాలతో కావలికి ప్రత్యేక గుర్తింపు రానుందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరిలో జాతీయభావం పెంపొందేలా పట్టణంలోని ఎంఎం బేకరీ సెంటర్‌లో అన్న క్యాంటిన్ ఎదురుగా నిర్మిస్తున్న వంద అడుగుల జాతీయ పతాకానికి సంబందించిన పనులను ఎమ్మెల్యే గురువారం పరిశీలించారు.



కాగా, పట్టణానికి ఒక ఐకానిక్ ఉండేలా ఎమ్మెల్యే సొంత నిధులతో, స్వీయ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపడుతున్నారు. కాంట్రాక్టర్ కు తగు సూచనలు చేశారు. డిజైన్ ప్రకారం త్వరితగతిన పనులు చేపట్టి ఈ నెల 15న ప్రారంభం అయ్యేలా చూడాలని కోరారు.

## ఆప్కో షోరూమ్‌లో మంత్రి సవిత తనిఖీలు

**విజయవాడ, మహానాడు :** గన్నవరం(విజయవాడ) ఎయిర్ పోర్టులో ఉన్న ఆప్కో షోరూమ్ ను రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవితి గురువారం తనిఖీ చేశారు. అక్కడున్న ఉప్కో షోరూమ్ ను తనిఖీ చేశారు. అన్ని వస్త్రాలను పరిశీలించారు. ఏయే వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అమ్మకాలు రోజూ ఏ మేర జరుగుతున్నాయని ఆరా తీశారు. ఏ వ్యాపారిని కైనా కస్టమర్లే దేవుళ్లని, వాళ్లతో హుందాగా వ్యవహరించాలని అక్కడి సిబ్బందికి మంత్రి సవిత దిశా నిర్దేశం చేశారు. ఆకస్మికంగా వచ్చిన




మంత్రి సవితని చూసి విమానాశ్రయంలోని ఆప్కో షో రూమ్ సిబ్బంది అప్రమత్త మయ్యారు. అనంతరం మంత్రిని షో రూమ్‌లోకి సాదరంగా ఆహ్వానించారు.

## నాగార్జున సాగర్ వద్ద కూలిపోయిన సుంకిశాల రిటెయినింగ్ వాల్

● వెల్లడించకుండా దాచిపెట్టిన ప్రభుత్వం

**విజయవాడ,మహానాడు:** నాగార్జునసాగర్‌కు లక్షల క్యూసెక్కుల వరద వస్తుండటం, నీటిమట్టం కూడా భారీగా ఉన్న సమయంలో రక్షణ గోడ వెనక గేటును ఏర్పాటు చేసి సొరంగాన్ని పూర్తిస్థాయిలో ఓపెన్ చేయడం వల్లనే సుంకిశాల రిటెయినింగ్ వాల్ కూలిపోయింది. అయితే, ఈ సంఘటనను ప్రభుత్వం బయటకు చెప్ప కుండా దాచిపెట్టింది. కూలీలు షిఫ్టు మారే సమయంలో జరగడంతో పెను ప్రమాదం తప్పింది. సంఘటన అనంతరం క్షణాల్లో పంప్‌హౌస్ జల దిగ్బంధమైంది. హైదరాబాద్ తాగు నీటి అవసరాలు తీర్చేందుకు నాగా ర్జున సాగర్ జలాశయం డెడ్‌స్టోరేజీ నుండి కృష్ణాజలాల తరలింపు కోసం సుంకిశాల పథకం చేపట్టారు. మూడు షిఫ్టుల్లో వందల మంది కూలీలు పని చేస్తుం



టారు. సరిగ్గా కూలీలు షిఫ్టు మారే సమయంలో ఈ ప్రమాదం జరగడంతో అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లలేదు. ఆగస్ట్ ఒకటో తేదీన ఉదయం ఆరు గంటలకు ఈ ఘటన జరగగా, జలమండలి అధికా రులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారు.

### జగన్ విధ్వంసంపై విడుదల చేసిన

# శ్వేతపత్రాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

(మొదటిపేజీ తరువాయి..)

అమరావతి-పోలవరం నిర్మాణం-నదుల అనుసంధానం, ఎనిమిది వెనకబడ్డ జిల్లాలకు కేంద్ర సహకారం, నామినేటెడ్ పోస్టుల భర్తీ, 22 ఏ దుర్వినియోగం, ఆగస్టు 15న అన్న క్యాంటీన్ల ప్రారంభోత్సవం, నరేగా, నీరు-చెట్టు బిల్లుల విడుదల, ప్రజావేదిక, ప్రజా దర్బార్‌లో వచ్చిన అర్జీల పరిష్కారానికి తగు యంత్రాంగం ఏర్పాటు, జన్మభూమి-2 ద్వారా పేదరికం లేని సమాజ నిర్మాణం, రూ.100కే పార్టీ సభ్యత్వంతోపాటు రూ.5 లక్షల ప్రమాద బీమా, ఐదేళ్ల జగన్మోహన్ రెడ్డి ఫేక్ ప్రచారం, విధ్వంస పాలనపై చర్చించారు.



ఎన్నికల విజయంలో కీలకపాత్ర వహించిన చంద్రబాబు నాయుడిని పోలిట్‌బ్యూరో అభినందిం చింది. విభజన హామీల అమలుకు కేంద్ర బడ్జెట్‌లో చొరవ చూపిన కేంద్ర ప్రభుత్వాన్ని పోలిట్‌బ్యూరో అభినందించింది. పలు అంశాలపై నేతలకు చంద్రబాబు కీలక సూచనలు చేశారు. గత ఐదేళ్లలో జరిగిన విధ్వంసాలు, దోపిడీ, భూ కబ్జాలపై కూటమి ప్రభుత్వం విడుదల చేసిన ఏడు శ్వేతపత్రాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పార్టీ నేతలకు సూచించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.... వివేక హత్య కేసులో సాక్ష్యాలు తారుమారు చేసేందుకు వైసీపీ నేతలు ఏ విధంగా ప్రయత్నించారో, మదనపల్లెలో భూ కుంభకోణాలకు సంబంధించిన సాక్షాలను తారుమారు చేసేందుకు కూడా అదే విధంగా కుట్ర చేశారు. వివేకాది గుండెపోటని ప్రచారం చేసినట్లే.. మదన పల్లెలో ఫైళ్లు దగ్ధాన్ని షార్ట్ సర్క్యూట్ అని ప్రచారం చేసి సాక్షాలు తారుమారు చేసే ప్రయత్నం చేశారు. వెంటనే స్పందించి ఉన్నతాధికారులను సంఘటనా స్థలానికి పంపడంతో వాస్త వాలు బట్టబయలయ్యాయి. పెద్దిరెడ్డి అక్రమాలపై ఒక్కరోజు లోనే వేలాది మంది బాధితులు స్వచ్ఛందంగా వచ్చి ఫిర్యాదు చేశారంటే అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఏ విధంగా అరాచకా లకు పాల్పడ్డారో ఈ సంఘటన ద్వారా బట్టబయలయ్యిం దన్నారు.

### జగన్ రెడ్డిది నేరస్థుల గుంపు

వైసీపీ అంటేనే నేరస్థులు, అరాచకవాదులని చంద్ర బాబు అన్నారు. ఆ పార్టీలో ఉండేది ప్రజలకు సేవ చేద్దామని కాదు ప్రజల ఆస్తులను దోచుకోవడానికి. 13 లక్షలకు పైగా అసైన్డ్ భూములను కాజేయడంతో పాటు 40 వేల ఎకరాల అసైన్డ్ భూములను రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నారు. మరో వైపు 22ఏ అధికార దుర్వినియోగానికి ఉపయోగించి వైసీపీ నేతలు పెద్ద ఎత్తున సెటిల్మెంట్లు, దందాలు చేశారు.

### 55 రోజుల్లో పాలనా విజయాలు

కూటమి అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి హోదాలో చేసిన ఐదు సంతకాల అమలును ప్రారం భించామని చంద్రబాబునాయుడు తెలిపారు. పింఛన్లు రూ.4 వేలకు పెంపు, 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ఇవ్వడం, ల్యాండ్ టైటి లింగ్ యాక్ట్ రద్దు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, నైపుణ్య గణన వంటి వాటిని ప్రభుత్వం అమలు చేస్తుంది. దాతల నుంచివిరాళాలు సేకరించి తిరుమలలో అన్నదాన కార్యక్రమం ఏ విధంగా చేపట్టామో అదే మాదిరి అన్న క్యాంటీన్లు విజయవంతంగా నిర్వహిస్తాం. ఒక్క రోజులోనే 98 శాతానికి పైగా పింఛన్లను పంపిణీ చేసి వృద్ధులు, వికాలాంగులు ఎవరూ ఇబ్బందులు పడకుండా చేశాం. పీ4 విధానం ద్వారా పేదరిక నిర్మూలన, సంపద సృష్టికి కృషి చేస్తాం. అలాగే ఇటీవల కురు సిన వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తుంది.

### త్వరలోనే జన్మభూమి 2

రాష్ట్రాభివృద్ధికి నీతి ఆయోగ్ సహకారంతో సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నట్టు చంద్రబాబు నాయుడు తెలిపారు. విజన్ 2020 మంచి ఫలితాలను ఇచ్చిందని అలానే విజన్ 2047ను రూపొందిస్తాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో చేపట్టిన జన్మభూమి కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. నాడు చేపట్టిన అభివృద్ధి పనులు ఇప్పటికీ కని పిస్తున్నాయి. ఇప్పుడు ప్రజల సహకారంతో జన్మభూమి 2 కింద ప్రజలందరి సహకారంతో అభివృద్ధి సంక్షేమ కార్య క్రమాలు నిర్వహిస్తామన్నారు.

### కేంద్ర సహకారంతో రాష్ట్ర సమగ్రాభివృద్ధి

విభజన చట్టం హామీల అమలుకు సహకరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి పోలిట్ బ్యూరో ధన్యవాదాలు తెలియజేసింది. అమరావతి నిర్మాణానికి, పోలవరం పూర్తి చేయడానికి, 8 వెనకబడ్డ జిల్లాల అభివృద్ధికి అవ సరమైన నిధులు ఇవ్వడానికి సత్వరమే అంగీకరించడం శుభ పరిణామం. పోలవరం డయాం ఫ్రం వాల్ మూడు చోట్ల దెబ్బ తిన్నది. దానిపై ఏం చేయాలనే దానిపై కేంద్ర నిర్ణయం తీసుకుంటుంది. రాష్ట్రం యొక్క పునర్నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ సహకారం ఎంతో అవసరం. ఏపీలో కూటమి ప్రభుత్వం సాధించిన అద్భుత విజయంతో ఢిల్లీలోనూ మనకు ప్రత్యేక గౌరవం లభిస్తోంది.

### రూ.100కే పార్టీ సభ్యత్వం, పార్టీ సభ్యుల ప్రమాద బీమా రూ.5 లక్షలకు పెంపు

పార్టీ సభ్యులకు ఇచ్చే ప్రమాద బీమాను రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచుతూ పోలిట్ బ్యూరో నిర్ణయం తీసుకుంది. వాట్సాప్ ద్వారా సభ్యత్వ నమోదు చేసుకునే వెసులుబాటును కల్పిస్తారు. ఓటిపి ఎంటర్ చేసి రూ.100 రుసుం చెల్లించి సభ్యత్వం తీసుకోవచ్చు. పార్టీ సభ్యత్వం తీసు కున్నవారికి వెంటనే వాట్సాప్‌లోనే కార్డు అందజేస్తారు.

ఆ తర్వాత ఒరిజినల్ సభ్యత్వ కార్డును బూత్‌ల ద్వారా కార్యకర్తలకు అందజేస్తారు. పార్టీ సంక్షేమ విభాగం ద్వారా ఇప్పటి వరకు రూ.120 కోట్లు మేర ప్రమాద బీమా అందిం చారు. సంక్షేమ విభాగం తరుపున పార్టీ కుటుంబ సభ్యులైన 1,672 మంది విద్యార్థులకు వారి చదువుల నిమిత్తం సుమారు రూ.2 కోట్ల 35 లక్షలు ఆర్థికం సహాయం అందించింది. విదేశాలలో చదువుతున్న, చదవాలనుకున్న సుమారు 180 మందికి కూడా అవసరమైన సహాయ, సహ కారాలు అందించారు. పార్టీ స్కిల్ డెవలప్‌మెంట్, ఎంపవర్‌మెంట్ విభాగం ద్వారా 2,437 మందికి వివిధ కంపెనీలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించింది. ఎన్ఆర్ఐ టీడీపీ విభాగం ద్వారా 2 వేల మందికి శిక్షణను ఇచ్చి 850 మందికి రాష్ట్రంలో రెండు వందల మందికి విదేశాల్లో ఉద్యోగాలు ఇచ్చారు. భవిష్యత్‌లో కార్యకర్తలు వారి కాళ్ల మీద వారు నిలబడే విధంగా ఎంపవర్ మెంట్ చేయాలని నిర్ణయించాం. కార్యకర్తల కుటుంబాల విద్య, వైద్య, ఉపాధి కోసం పార్టీ అండగా ఉంటుందని చంద్రబాబు తెలిపారు.

### నిబద్ధతతో పనిచేసిన వారికి నామినేటెడ్ పదవులు

నిబద్ధతతో కష్టపడి పనిచేసిన వారికి నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇస్తామని చంద్రబాబు తెలిపారు. తెలుగుదేశం పార్టీ నాయకుల, కార్యకర్తల త్యాగాలు మర్చిపోలేవి. ప్రభు త్వానికి, పార్టీకి సమాంతర ప్రాధాన్యత ఇస్తాం. గతంలో ఎన్నడూ చేయని విధంగా రాత్రింబవళ్లు కసరత్తు చేసి సార్వ త్రిక ఎన్నికల్లో అభ్యర్థులను ఎంపిక చేసి అన్ని వర్గాల ప్రజల ఆమోదం పొందాం. ఇప్పుడు నామినేటెడ్ పోస్టుల విషయంలో కూడా అదే విధమైన కసరత్తు నిర్వహించి అర్హులన వారం దరికీ, ప్రజామోదం ఉన్నవారందరికీ పదవులు లభిస్తాయి. సిఫార్సులతో సంబంధం లేకుండా పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలను గుర్తించి దశల వారిగా నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తామన్నారు.

తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయానికి మంత్రులు తప్పనిసరిగా రావాలి. కార్యకర్తలు, ప్రజల నుంచి అర్జీలు తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నాం. రాష్ట్రాన్ని అన్ని విధాలా నాశనం చేసిన జగన్ రెడ్డిని ఇంటికి పంపించాలనే ఉద్దేశంతో ఇతర రాష్ట్రాల్లో కూలీలుగా పనిచేస్తున్నవారు. వైసీపీ విధ్వంస పాలన వల్ల ఉపాధి కోల్పోయి వలస వెళ్లిన కార్మికులు కూడా వచ్చి ఎన్నికల్లో ఓటేశారు. అలానే ఎన్నికల్లో ఎన్ఆర్ఐలు విదేశాల నుంచి వచ్చి ఏడాదిపాటు పనిచేసినవారు కూడా ఉన్నారు.

సకాలంలో వర్షాలు పడి రిజర్వాయర్లు నిండటం శుభ పరిణామం. వ్యవసాయ అనుకూల వాతావరణం ఏర్పడింది. జిల్లాల జనాభా దామాషాను బట్టి ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని పోలిట్ బ్యూరో ప్రతిపాదించింది. వైసీపీ తప్పుడు ప్రచారాలు, కుట్రలను పార్టీ శ్రేణులంతా వెంటనే తిప్పి కొట్టి ప్రజా చైతన్యం పెంచాలి. ఉచిత ఇసుక వంటి వాటిపై దురుద్దేశంతో తప్పుడు ప్రచా రాలు చేస్తున్నారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి తగిన కృషి చేయాలని పోలిట్ బ్యూరో నిర్ణయించారు. ఈ చారిత్రాత్మ విజయంలో భాగస్వా ములైన పార్టీ నాయ కులు, కార్యకర్తలు సేవలు మరువలేనివని, వైసీపీ అవినీతి, అరాచకాలపై పోరాడి 52 రోజుల పాటు జైలుకు వెళ్లొచ్చి, సమర్థవంతమైన నాయకత్వం అందించిన నారా చంద్రబాబు నాయుడుకి పొలిట్ బ్యూరో ధన్యవాదాలు తెలిపింది.



## గిరిజనులకు సీఎం రేవంత్ శుభాకాంక్షలు

**హైదరాబాద్, మహానాడు:** అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిజనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మూలవాసులుగా, అమ్మలాంటి అడవికి తోడుండే భూమిపుత్రులుగా, కల్మశంలేని అనుబంధాలకు ప్రతీకలుగా ఆదివాసీలు నిలుస్తారని, అలాంటి గిరిజనుల హక్కుల పరిరక్షణకు, వారి సంక్షేమాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి ఒక సందేశంలో తెలిపారు.

రూ.17,056 కోట్ల కేటాయింపుతో బడ్జెట్‌లో గిరిజన సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చామన్నారు. గతంలో పేరుకు పంచాయితీలుగా మారినా పైసా నిధులు లేక నిర్లక్ష్యానికి గురైన గిరిజన గూడేల్లో రోడ్లు, విద్యుత్, వైద్యం, విద్య వంటి మౌలిక సదుపాయాల కల్పనకు తమ ప్రభుత్వం సంకల్పించిందని ముఖ్యమంత్రి గుర్తు చేశారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 09, ఆగస్టు 2024



# దక్షిణ భారత దేశానికి గోల్డ్ హబ్‌గా మంగళగిరి

- చేనేత కళాకారుల ఆదాయం పెరిగేలా కార్యచరణ
- మంగళగిరిలో మంత్రి లోకేష్

మంగళగిరి,

దక్షిణ భారత దేశానికి గోల్డ్ హబ్ గా మంగళగిరి తయారు చేసేందుకు కృషి చేస్తానని, ఇక్కడి పద్మశాలీయ బహూత్తమ సంఘం చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు అన్నివర్గాలకు ఆదర్శనీయంగా నిలుస్తున్నాయని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. మంగళగిరి నాంచారమ్మ చెరువు ప్రాంగణంలో పద్మశాలి బహుత్తమ సంఘం ఆధ్వర్యాన నూతనంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని మంత్రి లోకేష్ గురువారం ఉదయం ప్రారంభించారు.

శ్రీ భద్రావతి సమేత భావనారుషి స్వామి ఆలయ ప్రాంగణానికి చేరుకున్న లోకేష్, బ్రాహ్మణి దంపతులకు బహుత్తమ సంఘం పెద్దలు ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ భద్రావతి సమేత భావనారుషి స్వామి ఆలయాన్ని దర్శించుకొని లోకేష్, బ్రాహ్మణి దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ పద్మశాలీయ బహూత్తమ సంఘం చేపట్టే కార్యక్రమాలకు తమవంతు సహాయ, సహకారాలు అందిస్తామని చెప్పారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు.

మంగళగిరి చేనేతలు తన ఆత్మ బంధువులని, ఎన్నికల్లో వారు తనపై చూపిన అభిమానం జీవితంలో మరువలేనని అన్నారు. మంగళగిరి చేనేతకు గత వైభవం కల్పించేందుకు అన్ని చర్యలూ చేపడతానని చెప్పారు.

చేనేత కార్మికుల ఆదాయం పెంచడానికి పైలెట్ ప్రాజెక్టుగా వీవర్స్‌శాల ఏర్పాటు చేసి టాటా తనేరా కంపెనీతో మార్కెట్ లింకేజ్ చేశామని అన్నారు. చేనేతలో భాగస్వామ్యం అయిన అన్ని విభాగాల కార్మికులకు ఆదాయం పెరిగే విధంగా కార్యచరణ రూపొందిస్తున్నాం, త్వరలోనే జీఎస్టీ సమస్య కూడా పరిష్కారం అవుతుందని లోకేష్ అన్నారు.

మంగళగిరిలో ఉన్న స్వర్ణకారులకి స్కిల్ డెవలప్మెంట్ ద్వారా మెరుగైన డిజైన్లు తయారు చేసే శిక్షణ ఇస్తామని అన్నారు. దక్షణ భారత దేశానికి గోల్డ్ హబ్ గా మంగళగిరిని తీర్చిదిద్దడానికి సుమారుగా 25 ఎకరాల్లో ప్రత్యేక గోల్డ్ హబ్ ఏర్పాటుకు కసరత్తు ప్రారంభించామని లోకేష్ తెలిపారు. మంగళగిరిలో ఏళ్ల తరబడి పేరుకుపోయిన అనేక సమస్యలు ఉన్నాయి. నేను వేసే ప్రతి అడుగు సమస్యల శాశ్వత పరిష్కారం వైపు ఉంటాయని స్పష్టం చేశారు. మూడు నెలలు రాజకీయాల కోసం పోరాడాం ఇప్పుడు 4 ఏళ్ల 9 నెలలు రాజకీయాలకు అతీతంగా అందరం కలిసి నియోజకవర్గం సంక్షేమం, అభివృద్ధి కోసం పని చేద్దాం అని లోకేష్ పిలుపు ఇచ్చారు.

మంగళగిరి పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘం ఆధ్వర్యంలో అందరికీ అందుబాటులో ఉండే విధంగా కల్యాణ మండపం నిర్మించారని, సంఘం నిర్వహించే సేవా కార ్యక్రమాల్లో యువతను భాగస్వామ్యం చేయ్యాలని, మంగళగిరి చరిత్ర తెలుసుకోవడంతో పాటు చరిత్ర ను కాపాడటం కోసం యువత అన్ని కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని లోకేష్ అన్నారు.

ఈ కార్ర్యమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతురావు ఆలయ అభివృద్ధి, చేనేత, స్వర్ణకారుల సంక్షేమం కోసం మంత్రి లోకేష్‌కు పలు సూచనలు చేశారు. జీఎస్టీపై కేంద్ర ప్రభుత్వంతో చర్చించడం, ఒకవేళ కేంద్రం ఒప్పుకోక పోతే జీఎస్టీ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం పట్ల ఆయనకి కృతజ్ఞతలు తెలుపుతున్నానని మురుగుడు హనుమంతు రావు అన్నారు.

పెద్దలందరితో చర్చించిన తరువాత అన్ని కార్యక్రమాలు చేపడతామని లోకేష్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మె ల్సీలు మురుగుడు హనుమంతురావు, పంచుమర్తి అనురాధ, నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, జనసేన నియోజకవర్గం సమన్వయకర్త చిల్లపల్లి శ్రీనివాస్, పద్మ శాలీయ బహుత్తమ సంఘం పెద్దలు పాల్గొన్నారు.





























జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | శుక్రవారం 09, ఆగస్టు 2024



# టీడీపీ కేంద్ర కార్యాలయానికి పోటెత్తిన వైసీపీ బాధితులు..

- అర్జీలు స్వీకరించిన మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి











మంగళగిరి, మహానాడు:

తెలుగుదేశంపార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రతిరోజు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మీకోసం కార్యక్రమానికి గురువారం వినతులతో వైసీపీ బాధితులు, ప్రజలు పోటెత్తారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబులు రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకుల నుండి అర్జీలు స్వీకరించారు. గురువారం నిర్వహించిన మీకోసం కార్యక్రమానికి దాదాపు 100కు పైగా ఫిర్యాదులు వచ్చాయి.

భూ సమస్యలు, లా అండ్ ఆర్డర్ కు సంబంధించిన సమ స్యలు అత్యధికంగా ఉన్నాయి. అర్జీదారుల నుండి మంత్రులు వినతి పత్రాలు తీసుకుని, వారి సమస్యలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలకు సంబంధించి మంత్రులు సంబంధిత అధికారులకు అక్కడికక్కడే ఫోన్లు చేసి పరిష్కరించాలని ఆదేశించారు. మిగిలిన వినతిపత్రాలను సంబంధిత శాఖ అధికారులకు పంపించి, వాటిని పరిష్కరిం చేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మాచర్ల నియోజకవర్గానికి చెందిన బత్తుల లక్ష్మి అనే మహిళ మాచర్ల పట్టణంలో ఉన్న తన 33 సెంట్ల స్థలాన్ని మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి





అనుచరులు కబ్జా చేశారని ఆ స్థలం తనకి ఇప్పించాలని కోరారు.మంగళగిరి నియోజకవర్గం నూతక్కి గ్రామానికి చెందిన తోట నాగమణి అనే 64 ఏళ్ల వృద్ధురాలు.. తన చిన్న కుమారుడు ఆస్తి, నగలు లాక్కొని ఇంటి నుంచి తనను వెల్లగొట్టాడని, ఇంటివైపు వస్తే చంపుతానంటూ బెదిరిస్తు న్నాడని వాపోయింది. తన ఆస్తి నగలు ఇప్పించి తన కుమారుడి నుంచి రక్షణ కల్పించాలని వేడుకుంది.

నెల్లూరు జిల్లా కోవూరు మండలం బుడంపాడు గ్రామానికి చెందిన సురేష్ బాబు అనే వ్యక్తి.. వైసీపీ ప్రభుత్వంలో కుట్రపూరితంగా రోడ్డు ప్లానింగ్ మార్చి తన స్థలంలో రోడ్డు వేశారని, స్థానిక వైసీపీ నేతలతో పాటు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా అన్ని ఫిర్యాదులు పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని ఫిర్యాదుదారులకు మంత్రులు హామీ ఇచ్చారు.









# మరో ఉద్దానంగా మారక ముందే మేల్కొండి

- ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లో కిడ్నీ బాధితులను కాపాడండి
- ఈ నెల 27,28,29 తేదీల్లో ఎ.కొండూరు నుండి విజయవాడ కలెక్టర్ కార్యాలయం వరకు ప్రజా ఆరోగ్య పరిరక్షణ పాదయాత్ర
- సీపీఐ వెల్లడి

విజయవాడ, మహానాడు:

ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం, గంపల గూడెం మండలాలు కిడ్నీ బాధితుల ఆవాస కేంద్రా లుగా మారిపోతున్నాయని సిపిఐ ఎన్టీఆర్ జిల్లా కార్య దర్శి దోనేపూడి శంకర్ అన్నారు. స్థానిక హానుమాన్ పేట, దాసరిభవన్ లో గురువారం ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అయి దేళ్ళగా ఎ.కొండూరు, చీమలపాడు పరిసర ప్రాంతాల గ్రామ, గిరిజన తండాలలో 300 మందికి పైగా, ఎ.కొండూరు మండలం హానుమాన్‌లంక గ్రామంలో గిరిజనులు ప్రాణాలు వదిలారని ఆవేదన వ్యక్తం చేశారు.

వందల మంది కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఆసు పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. తాము తాగుతున్న మంచినీళ్ళే కబలిస్తున్నా ఊరు వదల లేక ఊపిరి వదులుతున్నారని పేర్కొన్నారు. 50 కోట్లతో కృష్ణ జలాలను తాగునీటిని పైప్‌లైన్ల ద్వారా సరఫరా చేస్తామని చెప్పిన నాటి ప్రభుత్వ వాగ్దానాలు ఆచరణలో నేటికీ అమలు కాలేదని విమర్శించారు.



ఫ్లోరైడ్, సిలికాన్ కలిసిన నీటిని తాగిన గిరిజన తండాల ప్రజలు కిడ్నీ వ్యాధి బారినపడి తీవ్ర అనా రోగ్యంతో బాధపడుతున్నా, ప్రభుత్వం కంటితుడు పుగా ఏర్పాటు చేసిన ఎ.కొండూరు డయాలసిస్ సెంటర్లో అర్హత కలిగిన నిపుణులు, అంబులెన్స్ లేకపోవుట వలన గిరిజనుల ప్రాణాలు అనంత వాయు వుల్లో కలిసిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేసారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న "జలజీవన్ మిషన్" అడుగు ముందుకు కదలలేదన్నారు. కొండపల్లి, ఇబ్రహీంపట్నంలలో పరిశ్రమల నుండి వెలువడుతున్న పారిశ్రామిక వాయు కాలుష్యం వలన తీవ్రమైన అనారోగ్యానికి ప్రజలు గురవుతున్నారని చెప్పారు. వి.టి.పి.ఎస్ నుండి వెలువడే బూడిదతో ప్రజలు సహజీవనం చేస్తున్నారని తెలిపారు. 2000 పరిశ్రమలకు కొండపల్లి, ఇబ్రహీంపట్నం పారిశ్రామిక కేంద్రాలుగా ఉన్నాయన్నారు. కాలుష్య నివారణకు వరుసవెంబడి ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు "నిమ్మకు నీరెత్తినట్లు"గా వ్యవహ రిస్తున్నారని మండిపడ్డారు.

"పాడెక్కుతున్న ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలని" కోరుతూ సిపిఐ ఆధ్వర్యాన ఆగస్టు 27,28,29 తేదీ లలో రాజకీయాలకు అతీతంగా తిరువూరు నియోజక వర్గం ఎ.కొండూరులోని డయాలసిస్ సెంట్రల్ నుండి విజయవాడ కలెక్టరు కార్యాలయం వరకు జరిగే "ప్రజా ఆరోగ్య పరిరక్షణ పాదయాత్ర" నిర్వహించనున్నట్లు తెలిపారు. సిపిఐ ఎన్టీఆర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో జరగనున్న ఈ పాదయాత్రలో ప్రజలు పెద్ద ఎత్తున మద్దతు పలికి గ్రామ గ్రామాన ప్రజలు పాదయాత్రలో భాగస్వాములు కావాలని కోరారు.

ఈ సమావేశంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు, సిపిఐ ఎన్టీఆర్ జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్నీడి యలమందరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి చిలుకూరి వెంక టేశ్వరరావు, ఎ.కొండూరు మండల కార్యదర్శి మేకల డేవిడ్, తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి ఎస్కే నాగుల్ మీరా, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు లంకా గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

## బుద్ధ వెంకన్న జన్మదిన వేడుకల్లో విషాదం

### బ్యానర్లు కడుతూ కరెంట్ షాక్‌కు గురై వ్యక్తి మృతి

తాడేపల్లి, మహానాడు:

బుద్ధ వెంకన్న జన్మదిన వేడుకల్లో విషాదం చోటుచేసుకుంది. గురువారం బ్యానర్లు కడుతూ అప్పలనాయుడు (52) అనే వ్యక్తి కరెంట్ షాక్ కు గురై మృతి చెందాడు. ఘనంగా పుట్టినరోజు వేడుకలు జరుపుకున్న వేళ ఈ విషాదం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇంటికి వెళ్లే దారిలో తాడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. బి ఆర్ టి ఎస్ రోడ్డు కేంద్రీయ విద్యాలయం సమీపాన భాను నగర్ ప్రాంతంలో నివసించే అప్పలనాయుడు కు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. అప్పలనాయుడు మృతదేహాన్ని బి ఆర్ టి ఎస్ రోడ్డు సమీపాన ఉన్న కేంద్రీయ విద్యాలయం వద్ద భాను నగర్ ప్రాంతంలో ఇంటిదగ్గరకి తీసుకొచ్చి నట్టు సమాచారం.

10

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ | శుక్రవారం 09, ఆగస్టు 2024

## 'మిస్టర్ బచ్చన్' అందరి అంచనాలని అందుకుంటుంది

**- డైరెక్టర్ హరీష్ శంకర్**

మాస్ మహారాజా రవితేజ, హరీష్ శంకర్ కాంబో 'మిస్టర్ బచ్చన్'తో మరో మాస్ సునామీని సృష్టించడానికి సిద్ధంగా ఉంది. మూవీ ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజున విడుదల కానుంది. ఈ సినిమాకి సంబందించిన ప్రమోషన్ కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి, టీజర్‌తో పాటు పాటలు హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి. ఇప్పుడు మేకర్స్ థియేట్రికల్ ట్రైలర్ ను లాంచ్ చేశారు. రవితేజ చెప్పిన పవర్ ఫుల్, ఇంపాక్ట్ ఫుల్ డైలాగ్‌తో ట్రైలర్ ప్రారంభమవుతుంది. "సరిహద్దు కాపాడేవాడే సైనికుడు కాదు... సంపద కాపాడేవాడు కూడా సైనికుడే.."అనే డైలాగ్ సినిమాకి టోన్ సెట్ చేస్తుంది. రవితేజ కమాండింగ్ ప్రెజెన్స్ కట్టిపడేసింది. బచ్చన్ తన ఊర్లో జిక్కీ అనే అమ్మాయితో ప్రేమలో ఉంటాడు. ట్రైలర్‌లోని రెప్పల్ డప్పుల్ అనే హై-ఎనర్జీ నంబర్ ఒక హైలెట్ గా నిలిచింది. పవర్ ఫుల్ వ్యక్తికి వ్యతిరేకంగా ఐటీ దాడులకు నాయకత్వం వహించడానికి హీరో యాక్షన్ లోకి దిగడంతో ట్రైలర్ లో ఇంటెన్స్, కాన్ఫ్లిక్ట్ నెక్స్ట్ లెవల్ కి చేరుకుంది. ట్రైలర్ ప్రామిస్ చేసినట్లుగా, ఈ మూవీ రొమాన్స్, డ్రామా, యాక్షన్ గ్రేట్ బ్లెండింగ్ ని అందిస్తోంది. టైటిల్ రోల్‌లో రవితేజ పెర్ఫార్మెన్స్, ఎనర్జీ, చరిష్మా అద్భుతంగా వుంది. మాగ్నెటిక్ ప్రెజెన్స్‌తో స్క్రీన్‌పై అదరగొట్టారు. జగపతి బాబు పవర్ ఫుల్ రోల్ ని పోషించారు. తన క్యారెక్టర్ నెరేటివ్ లో ఇంటెన్స్, కాన్ఫ్లిక్ట్ ని యాడ్ చేసింది. భాగ్యశ్రీ బోర్స్ తన అద్భుతమైన గ్లామర్, పెర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకుంది. రవితేజ, భాగ్యశ్రీ లవ్లీ కెమిస్ట్రీని



పంచుకున్నారు. సత్య అండ్ గ్యాంగ్ హ్యూమర్ రిలీఫ్ ని అందిస్తు న్నారు. కమర్షియల్ సబ్జెక్ట్‌ని హ్యాండిల్ చేయడంలో హరీష్ శంకర్ తన నైపుణ్యాన్ని మరోసారి చూపించారు. అయనంక బోస్ సినిమాటోగ్రఫీ అద్భుతంగా వుంది. విజువల్స్ చాలా గ్రాండ్ వున్నాయి. మిక్కీ జె మేయర్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమా హీరోయిక్ ఎలిమెంట్‌లను మరింత ఎలివేట్ చేస్తోంది.

## విశ్వక్ సేన్, అనుదీప్ కెవి కాంబో

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ తన నెక్స్ట్ లైనప్ సినిమాలకు సంబంధించిన అనౌన్స్‌మెంట్స్‌తో ఎక్సయిట్మెంట్ పెంచుతున్నారు. ఈరోజు విశ్వక్ సేన్ 14వ చిత్రాన్ని అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు. జాతి రత్నాలు ఫేమ్ అనుదీప్ కెవి దర్శకత్వం వహించ నున్న ఈ కాంబినేషన్ నవ్వుల వర్షం క్రియేట్ చేయబోతోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై విజనరీ నిర్మాత టిజి విశ్వ ప్రసాద్ ఈ చిత్రాన్ని గ్రాండ్ గా నిర్మించనున్నారు. హై-ఎనర్జీ పెర్ఫార్మెన్స్‌లో ఆదరగొట్టె హీరో విశ్వక్ సేన్, హిలేరియస్ ఎంటర్టైనర్స్ రూపొం దించడంలో అనుదీప్ కెవి దిట్ట, వీరి కొలాబరేషన్ యూనిక్ స్టోరీ లైన్ తో అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌ను అందించడానికి సిద్ధంగా ఉంది. ఈ కాంబో విశ్వక్ సేన్ డైనమిక్ స్క్రీన్ ప్రెజెన్స్‌ని అనుదీప్ కెవి సిగ్నేచర్ హ్యూమర్‌తో బ్లెండ్ చేసి అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్‌ని అందించనుంది. ఈ సినిమాకి టాప్ టెక్నీషియన్లు పని చేస్తున్నారు. లేటెస్ట్ సెన్సేషన్ భీమ్స్ సిసిరోలియో సంగీతం సమకూరుస్తుండగా, సురేష్ సారంగం సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. కెవి అనుదీప్‌తో పాటు మోహన్ సతో కథను అందించారు.



## బిగ్‌బాస్ స్టార్ మానస్ చేతుల మీదుగా రెస్టారెంట్



బిగ్‌బాస్ స్టార్ మానస్ నాగులపల్లి ప్రారంభించిన 'ఓ.జి.ఎఫ్'...

ఘుమఘుమలాడే ఫుడ్ ఉండాలి కానీ దాన్ని ఆరగించటానికి మనం ఎంత దూరమైనా వెళతాం. మాదాపూర్ నుండి కైతలాపూర్ వెళ్లే దారిలో ఓన్లీ గుడ్ ఫుడ్ పేరుతో ఓ రెస్టారెంట్ అండ్ క్యాటరింగ్ సర్వీసెస్‌ను లంచ్ బాక్స్ ఫర్ కార్పోరేట్ క్యాటరింగ్స్‌ను గురువారం ఉదయం ప్రారంభించారు రియల్ ఎస్టేట్ బిజినెస్‌లో ఉన్న తారక్. హొటల్ ఓపెనింగ్‌కి బిగ్‌బాస్ స్టార్ మానస్ నాగులపల్లి ముఖ్య అతిథిగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ఓ.జి.ఎఫ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మానస్ మాట్లాడుతూ– ' నేను ఈ రెస్టారెంట్‌ను ప్రారంభించటానికి ముఖ్యకారణం తారక్ గారు. నేను ఏం తిన్నా కూడా చాలా హైజిన్‌గా ఉండాలి. తారక్ ఈ విషయంలో చాలా క్లియర్‌గా ఉన్నాడు. మంచి ఫుడ్‌ను సర్వ్ చేయాలి కానీ ఎవరైనా ఎంత దూరమైనా వచ్చి తింటారు. ఓ.జి.ఎఫ్ సక్సెస్ అవ్వాలని అనేక బ్రాంచిలు రావాలని కోరు కుంటున్నా" అన్నారు. రెస్టారెంట్ ఓనర్ తారక్ మాట్లాడుతూ– 'కూడు, నీడ, గుడ్డ ప్రతి ఒక్కరికి అవసరం. అందులో మొదటగా వచ్చేది ఫుడ్. నాకు వ్యక్తిగంతగా మంచి ఫుడ్ తినటం, వండి పెట్టడం రెండు ఇష్టమే. అందుకే రియల్ ఎస్టేట్‌లో చాలా బిజిగా ఉన్నాకూడా మంచి మనవాళ్లు మంచి ఫుడ్ తినాలి అనే ఉద్దేశ్యంతో ఈ రెస్టారెంట్‌ను ప్రారంభించాను. ఓ.జి.ఎఫ్‌ను చక్కని బ్రాండ్‌గా తయారు చేసి త్వరలోనే అనేక బ్రాంచిలను నెలకొల్పుతాను" అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు హరీశ్ నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## 'హరి హర వీరమల్లు'లో అనుపమ్ ఖేర్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'హరి హర వీరమల్లు'పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు ఉన్నాయి. ఈ పీరియాడికల్ యాక్షన్ చిత్రానికి మరో అదనపు ఆకర్షణ తోడైంది. లెజెండరీ భారతీయ నటులలో ఒకరైన అనుపమ్ ఖేర్ 'హరి హర వీరమల్లు'లో భాగమయ్యారు. ఈ చిత్రంలో ఆయన అత్యంత విలువైన, గౌరవనీయమైన పాత్ర పోషిస్తున్నారు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తొలిసారిగా లెజెండరీ నటుడు అనుపమ్ ఖేర్ తో తెరను పంచుకోబోతున్నారు. ఈ ఇద్దరు అగ్ర నటుల కలయికలో వచ్చే సన్నివేశాలు సినిమాకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, అభిమానులను ఎంతగానో అలరిస్తాయని నిర్మాతలు చెబుతున్నారు. 'హరి హర వీరమల్లు' చిత్రం జీవితాంతం గుర్తుండిపోయే మధురానుభూతిని అందిస్తుందని వాగ్దానం చేస్తున్నారు.



## అక్కినేని ఇంటికి కొత్తకోడలు


అక్కినేని నాగచైతన్య మరో పెండ్లికి సిద్ధమయ్యాడన్న వార్తలపై అధికారిక అప్‌డేట్ వచ్చేసింది. ముందుగా వచ్చిన వార్తల ప్రకారం నాగచైతన్య –నటి శోభితా ధూళిపాళ్ల నిశ్చితార్థం జరిగింది. ఇవాళ ఉదయం 9:42 గంటలకు నిశ్చితార్థం పూర్తయింది. ఈ విషయాన్ని నాగార్జున స్వయంగా ప్రకటించాడు.

శోభితా ధూళిపాళ్ల–నాగచైతన్య నిశ్చితార్థం వేదుక గురువారం ఉదయం 9:42 గంటలకు జరిగినట్లు హీరో నాగార్జున ఎక్స్‌వేదికగా ప్రకటించారు. దీంతో వారి ఎంగేజ్‌మెంట్ అధికారికంగా ధృవీకరించినట్లు అయింది. హీరో నాగచైతన్య, హీరోయిన్ సమంతల బంధం గురించి అందరికి తెలిసిందే. ప్రేమించి పెళ్లి చేసుకున్న ఈ జంట.. కొన్ని సంవత్సరాలకే విడాకులు తీసుకున్నారు. టాలీవుడ్‌లో సమంత –నాగచైతన్య జంట బెస్ట్ పెయిర్‌గా నిలుస్తుందని అందరు భావించారు. కాని వీరి మధ్య విభేదాలు రావడంతో విడాకులు తీసుకుని ఎవరి జీవితాన్ని వారు కొనసాగిస్తున్నారు.

2017 అక్టోబర్‌లో పెళ్లి చేసుకోగా, 2021లో విడాకులు తీసుకున్నారు. 2021 నుంచి ఒంటరిగా ఉంటున్న నాగ చైతన్య.. అందరూ ఊహిం చినట్లే శోభితా ధూళిపాళ్లను



వివాహమాడ బోతున్నారు. సమంతతో విడాకులు తీసుకున్న తర్వాత దాదాపు మూడేండ్ల తర్వాత శోభితాతో నాగచైతన్య నిశ్చితార్థం జరిగింది. ఈ నిశ్చితార్థ వేదుకకు ఇరు కుటుంబాల సభ్యులు హాజరయ్యారు.



## యశ్ భారీ పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్'

బాక్సాఫీస్ సెన్సేషన్ రాకింగ్ స్టార్ యశ్ హీరోగా బెంగళూరులో భారీ పాన్ ఇండియా మూవీ 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' గురువారం రోజున పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. అనౌన్స్‌మెంట్ రోజు నుంచి సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ ఎక్స్‌పెక్టేషన్స్‌ను మించేలా డైరెక్టర్ గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించనున్నారు.

పూజా కార్యక్రమాల్లో సంప్రదాయానికి అనుగుణంగా నటుడు, నిర్మాత యశ్, నిర్మాత వెంకట్ కె.నారాయణ, వారి కుటుంబ సభ్యులతో కలిసి సినిమా విజయం సాధించాలని దేవుడి ఆశీస్సులు కోరారు. పూజా కార్యక్రమాల్లో చిత్ర యూనిట్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరై టీమ్‌కి అభినందనలు తెలిపారు. కెజియఫ్ తర్వాత యశ్ ఎలాంటి సినిమా చేస్తారోనని ఆసక్తిగా ఎదురు చూసిన అభిమానుల నిరీక్షణకు ఈరోజుతో తెరపడింది.

అలాగే సినిమా ప్రారంభమైన రోజుని న్యూమరాలజీ ప్రకారం చూసిన 8-8-8ను సూచిస్తుంది. ఇది యశ్ పుట్టినరోజును తెలియజేస్తుంది.

## 'కమిటీ కుర్రోళ్లు' ప్రతీ ఒక్కరికీ కనెక్ట్ అవుతుంది

**- నిర్మాత నిహారిక కొణిదెల**

నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్.ఎల్.పి, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ బ్యానర్స్‌పై రూపొందిన చిత్రం 'కమిటీ కుర్రోళ్ళు'. ఈ సినిమాకు యదు వంశీ దర్శకుడు. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని ఆగస్ట్ 9న వంశీ నందిపాటి విడుదల చేస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్, ట్రైలర్, పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ క్రమంలో గురువారం నాడు నిర్మాత నిహారిక కొణిదెల మీడియాతో ముచ్చటించారు. ఆమె చెప్పిన సంగతులివే..

కథ విన్నాక ఈ చిత్రంలో నా పేరు మాత్రం కనిపించాలని అనుకున్నాను. ఫీచర్ ఫిల్మ్ చేయాలని అనుకున్న టైంలో అంకిత్ ద్వారా ఈ కథ నా దగ్గరకు వచ్చింది. మ్యూజిక్‌తో పాటుగా ఈ కథను నాకు వినిపించారు. అనుదీప్ గారు అప్పటికే మ్యూజిక్ చేసేశారు. సిటీలో పుట్టి పెరిగిన నేను జాతర ఎక్స్‌పీరియెన్స్ చేయలేదు. కానీ నాకు కళ్లకు కట్టినట్లుగా వంశీ చూపించాడు. నెరేషన్ అద్భుతంగా ఇచ్చాడు. ఓటీటీలో అయినా థియేటర్లో అయినా సినిమా మేకింగ్ ప్రాసెస్ ఒకటే. అందుకే ఈ కథను ఎలాగైనా నిర్మించాలని ఫిక్స్ అయ్యా.

పన్నెండేళ్లకు ఒకసారి వచ్చే జాతర చుట్టూ ఈ కథను రాసుకున్నాడు. మూడు తరాలను చూపించేలా ఈ కథ ఉంటుంది. వంశీ గారి పర్సనల్ ఎక్స్‌పీరియెన్స్‌లు కూడా ఇందులో ఉన్నాయి. వంశీ గారు పవన్ కళ్యాణ్‌కి అభిమాని. 2019 ఎన్నికల ప్రచార టైంలో జరిగిన విషయాలను కూడాఇందులో తన స్టైల్లో, కాస్త సెటైరికల్‌గా చూపించారు.

ముద్దపప్పు ఆవకాయ్ టైంలో నేను నటించాను. ఆ టైంలో నేను అందులో డబ్బులు కూడా పెట్టాను. అదే ప్రొడక్షన్ హౌస్ అయింది. కావాలని నిర్మాత అవ్వలేదు. అలా అయిపోయానంతే. నాకు నటించడమే ఇష్టం.

పదకొండు మంది అబ్బాయిల కారెక్టర్లో నన్ను నేను ఊహించుకొన్నాను. సినిమాను చూసే ప్రతీ ఆడియెన్ ఏదో ఒక కారెక్టర్‌తో ట్రావెల్ చేస్తారు. ప్రతీ ఒక్కరూ సినిమాకు కనెక్ట్ అవుతారు.

టాలెంట్ మాత్రమే కాదు.. క్రమశిక్షణ ఉంటేనే ఇండస్ట్రీలో ఎదుగుతారని చిరంజీవి గారు చెబుతుంటారు. ఆ క్రమశిక్షణ నేను వంశీలో చూశాను. ఆయన సినిమా కోసం చాలా కష్టపడ్డారు.

అంతా కొత్తవాళ్లుంటే.. బిజినెస్‌కు ఇబ్బంది అవుతుందని అన్నాను. కథ వినండి.. విన్న తరువాత చెప్పండని వంశీ అన్నారు. ప్రసాద్ ఒక్కడే అందరికీ తెలిసిన వ్యక్తి. వాళ్లంతా కూడా సినిమాతో మూడేళ్లుగా ప్రయాణం చేశారు. ఎవ్వరూ కూడా సెట్స్ మీద డైలాగ్ పేపర్ పట్టు



కోలేదు. నేను వాళ్లని ఎంచుకోలేదు.. వాళ్లే నన్ను ఎంచుకున్నారు.

కమిటీ కుర్రోళ్లు టైటిల్‌ను ముందే ఫిక్స్ చేశారు. నాకు కమిటీ కుర్రోళ్లు అంటే ఏంటో తెలియదు. పండుగలు, పబ్బాలు, గొడవలు ఇలా ఏది ఉన్నా కమిటీ కుర్రాళ్లే ముందుంటారని వంశీ చెప్పారు (నవ్వుతూ)

ప్రతీ ఒక్క పాత్రకు మంచి సీన్స్ ఉంటాయి. ప్రతీ ఒక్కరూ ఏదో ఒక సీన్‌లో షైన్ అవుతారు. ఇక అనుదీప్ ఇచ్చిన సంగీతం ఈ సినిమాకు ప్రాణం. ఆయన ఈ చిత్రానికి అద్భుతమైన పాటలు, ఆర్‌ఆర్ ఇచ్చారు. ఈ మూవీకి ఆయనే ప్రధాన బలం.

Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144